గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# ఫిబ్రవరి 2015
# కథలు




గతం చచ్చిపొమ్మంటుంది...

జ్ఞాపకం జీవించమంటుంది...

గతమంతా జ్ఞాపకమైతే బావుండనిపిస్తుంది...

ఏదీ తేల్చుకోలేని నా స్థితి నన్ను వెంటాడి వెంటాడి వేధిస్తుంది...

అందుకే.......

*****

ఆక్షణం నాకెందుకో అపురూపమైపోయింది .

వాడంటే నాకెంత ఇష్టమో వాడికి తెలియదు. కానీ నేనంటే వాడికెంత ఇష్టమో నాకు తెలుసు. వాడు నన్ను ఎంతగా ప్రేమించాడో చెప్పాలంటే...అమ్మో! ఈ జీవితం సరిపోదేమో. వాడు ఎన్ని సార్లు నా వెంటపడ్డాడో ప్రేమించమని కానీ నేను మాత్రం అంగీకరించలేదు. అలానే అనుకున్నాడు వాడు. కానీ వాడంటే నాకెంత ఇష్టమో... మనసు నిండా వాడిమీద ప్రేమే. కానీ ఏ రోజూ వాడికి చెప్పలేదు. ప్రత్యేకించి కారణాలు ఏమీ లేవు. నువ్వంటే నాకు ఇష్టమే అని చెప్పేస్తే....

వాడి చూపులు నాకిష్టం, వందమందిలో నేను ఎక్కడ ఉన్నా వాడి కళ్ళు మాత్రం నన్ను చూస్తూనే ఉంటాయి. నన్ను వెదుకుతున్న ఆ కళ్ళలో ఆరాటం నాకు ఎంత సంతోషాన్ని ఇస్తుందో... చూపుల బాణాలతో వాడు నన్ను తెగ తడిమేస్తాడు, ఆ క్షణం నాకు ఎంత సిగ్గేస్తుందో.

వాడి అడుగులు నాకిష్టం. నిశీథిలో ఉన్నా నన్ను చేరుకుంటూనే ఉంటాయి. ఎన్ని ఎదురు దెబ్బలు తిన్నాడో నాకోసం. వాడి శరీరం నుంచి కారిన రక్తం కూడా నన్ను బాధించలేదు. 'నా మీద వాడికున్న ప్రేమను వ్యక్తం చేస్తున్న రాయబారిలా కనిపించింది.' అందుకే చూసి నవ్వుకున్నానే కానీ దగ్గరికి చేరుకోలేక పోయాను.

వాడిమాటలు నాకిష్టం. ఎక్కడి నుంచి తీసుకొస్తాడో కానీ నేనే కాదు ఆ మాటలకు ఏ ఆడపిల్లైనా ఇట్టే పడిపోతుంది. కానీ వాడు మాత్రం నాకు పడిపోయాడు. అప్పుడప్పుడు భయమేస్తుంది కూడా, నా వెనుక తిరిగీ తిరిగీ నేను ఒప్పుకోలేదని వేరే అమ్మాయిని చూసుకుంటే. అమ్మో ! నేను బ్రతకగలనా?

అయినా సరే ఎందుకో వాడికి మాత్రం చెప్పలేక పోతున్నాను.

చెప్తే ... మళ్ళీ ఆ చూపులు నాకు కనపడవు కదా!

చెప్తే ... మళ్ళీ ఆ అడుగులు నన్ను వెంటాడవు కదా!

చెప్తే ... మళ్ళీ ఆ మాటలు నాతో మాటాడవు కదా!

అందుకే చెప్పాలని ఉన్నా చెప్పలేకపోతున్నా...

వాడు నా ఫోను నెంబర్ అడిగినప్పుడు నేను ఇవ్వనని చెప్పేశాను. కానీ నా స్నేహితురాలికి ఇచ్చి వాడికిమ్మని నేనే నంబర్ పంపించాను. నేనిచ్చానని చెప్పొద్దని చెప్పి మరీ పంపాను. వాడి ఫోను కోసం ఎంతగా ఎదురుచూశానో నాకే తెలియదు. అమ్మ ,నాన్న చేసే కాల్ కోసం కూడా నేను అంతగా ఎదురుచూడలేదు. విచిత్రం ఏమంటే అమ్మ కాల్ చేస్తే కట్ చేసి మరీ వీడి ఫోను కోసం ఎదురు చూశాను. వీడి ప్రేమ ముందు అమ్మ ప్రేమ కూడా చిన్నబోయిందా అనిపించింది. అయినా వీడి నుంచి ఇంకా ఫోను రాలేదు. ఎదురుచూస్తూనే ఉన్నాను. హాస్టల్ లో అందరూ పడుకున్నారు, నేను పడుకు న్నాను, రాత్రి గడిచిపోతూంది కాని నిద్రపట్టడం లేదు. అంతలో ఫోను మ్రోగింది. పోతున్న ఊపిరి కాస్తత తిరిగి వెనక్కి వచ్చింది. అరచేతుల్లోకి తీసుకున్న... నా ఊపిరిని, అదే... ఫోన్ ని.

గది నిండా నిశబ్దం. ఫోన్ లో కూడా నిశబ్దం. అవతలి నుంచి ఎవరూ మాట్లాడటం లేదు. కాసేపు చూశాను. వాడు గొంతు వినాలని నాకుంది. కానీ వాడు మాత్రం మాట్లాడటం లేదు. అది వాడని నాకు తెలుసు అందుకే మీరు మాట్లాడుతారా, ఫోన్ పెట్టేయమంటారా అని అనే సరికి ‘ అక్కడ ఫోన్ పెట్టేస్తే ఇక్కడ నా ఊపిరి ఆగిపోతుంది.’ అని మొదలు పెట్టాడు.(వాడికి తెలియని విషయమే మంటే వాడి ఊపిరి నా దగ్గర ఉంది. కాబట్టి అంతకంటే ముందే నా ఊపిరి ఆగిపోతుంది.) నా నెంబర్ ఎవరిచ్చారు అని అడిగాను. ఇష్టమైన వాళ్ళ నంబర్ తెలుసుకోవడం పెద్ద కష్టం కాదు అన్నాడు. “ఇష్టమైన వాళ్ళకి నంబర్ ఇవ్వడం కూడా పెద్ద కష్టం కాదు అని నాకూ అనాలనిపించింది.” కానీ వాడంటే నాకు ఇష్టమనే సంగతి వాడికి తెలిసిపోతుందని నేను ఏమీ అనకుండా మౌనంగా ఉండిపోయాను. వాడు మాత్రం మాట్లాడుతూనే ఉండిపోయాడు. నేను వింటూనే ఉండిపోయాను.

నేను మా అమ్మ, నాన్న తరువాత అంతగా ప్రేమించే వ్యక్తి ఈ లోకంలో ఎవరైనా ఉన్నారంటే అది నువ్వే. దయచేసి నా ప్రేమని అర్థం చేసుకో. జీవితాంతం కంటికి రెప్పలా చూసుకుంటాను. నిన్ను చూస్తున్న ప్రతిసారి నా హృదయం రెక్కలు విప్పుకు ఎగురుతుంది. నువ్వు వెళ్తున్న ప్రతిసారీ నా ప్రాణం విలవిలలాడిపోతుంది. నువ్వు ఒప్పుకుంటావనే ఆశ లోలోపల ఉన్నా... నువ్వు కాదంటే నా పరిస్థితి ఏమిటి అనే ఆలోచనే నన్ను అనుక్షణం వెంటాడుతుంది. ఇలా వాడు మాట్లాడుతుంటే వాడు నా ముందే ఉన్నట్టు అనిపిస్తుంది. నా గడ్డం పట్టుకొని బ్రతిమిలాడుతున్నట్టుగా ఉంది. ‘నా హృదయం ఘనీభవి స్తోంది... నా మనసు ద్రవీభవిస్తోంది.’ ఆ క్షణం నాకెందుకో అపురూపమైపోయింది. కనీసం ఇప్పుడైనా వాడికి నిజం చెప్పి ఉన్నట్టయితే బావుండేది. కానీ చివరి సారిగా ఒక్కసారి వాడిని ఏడిపించాలను కున్నా ను. ఒక్కసారి వాడితో ఆడుకోవాలనుకున్నాను. కానీ నేను ఆడే ఆట నాలోనేనని, నామీద నేనే తాత్కాలికంగా గెలిచి శాశ్వతంగా ఓడిపోతానని తెలియదు. అందుకే వాడితో చెప్పాను, ‘సారీరా నువ్వు నన్ను ఎంతగా ప్రేమిస్తున్నావో నాకు తెలుసు, నాకు ఈ ప్రేమలు, గీమలు అంటే పెద్దగా ఇష్టం లేదు, నమ్మకం కూడా లేదు. అందుకే దయచేసి నన్ను వదిలేయ్. నువ్వు నన్ను ప్రేమించకపోయినా, నేను నిన్ను ప్రేమించకపోయినా కాలం ఏమీ ఆగిపోదు కదా ! కనుక పిచ్చి పిచ్చి ఆలోచనలు అన్నీ మానేసి మంచిగా చదువుకో. అని నీతులు చెప్పాను.’ వాడు కూడా అవును కదా , అనవసరంగా ప్రేమించి సమయాన్ని, చదువుని వృధా చేసుకుంటున్నాను. ఇన్నాళ్లుగా నిన్ను ఇబ్బంది పెట్టినందుకు నన్ను క్షమించు. ఇంకెప్పుడూ నిన్ను ఇబ్బంది పెట్టను ..... ఇలా మాట్లాడుతూనే ఉన్నాడు ఫోన్ కట్ అయ్యింది. ఐదు నిముషాలు, పది నిముషాలు చూశాను, వాడి నుంచి ఫోన్ రాలేదు. భయమేసింది నిజంగానే వాడు మారిపోయాడా, నన్ను వదిలేస్తాడా అర్థం కాలేదు. ఇన్నాళ్ళు వాడు పడిన బాధ ఏమిటో ఈ పది నిముషాలలోనే నాకు అర్థమయ్యింది. వెంటనే వాడికి కాల్ చేశాను. రింగ్ అయ్యి కట్

అయ్యింది. తరువాత ఎంతసేపు ఫోన్ చేశానో, నా జీవితంలో అన్ని సార్లు ఎవరికీ ఫోన్ చేయలేదు. ఎన్ని సార్లు చేస్తున్నా వాడి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తూనే ఉంది, అలా నేను ఎప్పుడు పడుకున్నానో నాకే తెలియదు. కాని వాడి గురించే ఆలోచిస్తూ పడుకున్నాను.

తెల్లవారే సరికి నా ఫోన్ నిండా మిస్డ్ కాల్స్. మెసేజ్ లు. ఆత్రుతగా తీశాను. అవును వాడే, నాకోసం ఎప్పటినుంచి ఫోన్ చేస్తున్నాడో. నేను మెసేజ్ లు చూడలేదు. వెంటనే ఫోన్ చేశాను. కాని ఫోన్ తీసింది వాడు కాదు, వాడి ఫ్రెండ్. తను లేడు టెర్రస్ పైకి వెళ్ళాడు. వాడు వచ్చాక చెప్తాను అని ఫోను పెట్టేశాడు. అలానే చూస్తూ ఉండిపోయాను. కాసేపటి తరువాత నా ఫోను మ్రోగింది. వెంటనే ఫోను తీసి "ఐ లవ్ యు రా..." అనేశాను. కాని ఫోన్ చేసింది వాడు కాదు. వాడి ఫ్రెండ్. వెంటనే క్రిందికి రమ్మన్నాడు. ఎందుకని అడిగాను? వాడు నీకోసం క్రిందికి వచ్చాడు, వెంటనే క్రిందికి రా... అని ఫోన్ పెట్టేశాడు. నా కోసం వాడు... ఈ రోజుతో మా మధ్య ఉన్న ఈ కాస్త దూరం దగ్గరైపోతుంది. అంటే నేను వాడికి దగ్గరైపోతున్నానా? అయ్యబాబోయ్ ఎంత సిగ్గేస్తుందో... బయటకు వెళ్లగానే అందరూ పరిగెత్తుతున్నారు. కొందరైతే అరుస్తూ పరిగెత్తుతున్నారు. మరికొందరు ఏడుస్తూ పరిగెత్తుతు న్నారు. నాకేమీ అర్ధం కావటంలేదు. ఎవర్నడిగినా ఏమీ చెప్పే స్థితిలో లేరు. నా మనస్సు ఎందుకో వేదనపడుతోంది. వెంటనే ఫోన్ తీసి వాడుపంపిన మెసేజ్ లు చూశాను. "ఐదు నిముషాలలో రిప్లై ఇవ్వకపోతే బిల్డింగ్ పై నుంచి దూకి చచ్చిపోతాను." వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్ళాను. అవును వాడే రక్తపు మడుగులో, గుర్తుపట్టడానికి కూడా అవకాశం లేనంత దారుణమైన స్థితిలో వాడిని చూసి నేను తట్టుకోలేకపోయాను. కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. మసక మసక గా వాడి రూపం కనిపిస్తుంది. ఎంతగా ప్రయత్నించినా నావల్ల కావడం లేదు. ఏడుపు ఆగడంలేదు. అక్కడినుంచి వెళ్లిపోదామనుకుని వెనక్కి తిరగబోతుండగా వాడి చేతిమీద "నువ్వొస్తావని నాకుతెలుసు" అని రాసి ఉండటం గమనిం చాను. వెంటనే రూమ్ కి వచ్చేశాను. వాడి దగ్గరికి వెళ్లడానికి నిశ్చయించుకున్నాను. అందుకే ఈ లెటర్ రాసి వెళ్తున్నాను. దయచేసి నా శవాన్ని కూడా వాడి పక్కనే పాతిపెట్టండి. బతికుండగా కలిసుండలేని మేము చనిపోయిన తరువాతైనా కలిసుంటాం.

గమనిక : నా చావుకు నేనే కారణం.ఈ విషయంలో దయచేసి ఎవరినీ బాధపెట్టకండి. ఇక ఉంటా...సెలవు.

ఎంత ఈజీగా చచ్చిపోయారండీ... బిల్డింగ్ పైకి ఎక్కి దూకగానే సమస్యను పరిష్కరించుకోలేని వారి పిరికి గుండె వాళ్ళు నేలను తాకేలోపే ఆగిపోయి ఉంటుంది. చీమ కుట్టిన నొప్పికూడా తెలియ నంత సుఖంగా చనిపోయారు కదా వాళ్ళిద్దరూ... కానీ వారు పోయాక వాళ్ళ కోసం ఎన్ని హృదయాలు బాధపడి ఉంటాయో కదా, ఎన్ని కళ్ళు కన్నీళ్లు కార్చి ఉంటాయో కదా, ఒక్కసారి... ఒక్కసారి వాళ్ళు చావడానికి ముందు చనిపోయిన తరువాత జరిగే సంఘటనలను ఊహించగలిగి ఉంటే చావు ఎంత భయంకరంగా ఉండేదో వాళ్ళకు అర్థమయ్యేది.

'ఎండనక, వాననక... రాత్రనక, పగలనక... శ్రమ అనక, సుఖమనక... తినీతినక, త్రాగీత్రాగక, కనీసం కంటినిండా సరైన నిద్రాలేక పైసా పైసా కూడబెట్టి నిన్ను పై స్థితులకు చేర్చాలని తల్లిదండ్రులు తాపత్రయ పడుతుంటే అమ్మాయి ప్రేమించలేదని అబ్బాయి, అబ్బాయి ప్రేమించలేదని అమ్మాయి విలువైన జీవితం యొక్క విలువను గుర్తించక సూసైడ్ చేసుకుంటున్నారు. ఏ

ఇంజనీర్ చదువో చదువుకొని, ఉద్యోగం సంపాదించుకొని కారులోనో, మోటార్ బైక్ లోనో వస్తాడని కొడుకు కోసం ఎదురుచూస్తున్న తల్లికి తన ఇంటి ముందే ఆగిన అంబులెన్స్ వ్యాన్ చూసి భయం భయంగా దగ్గరకు వచ్చి డోర్ ఓపెన్ చేసి ఉన్న వ్యాన్ లోకి తొంగి చూస్తే...

రక్తపు మరకలతో, గుర్తుపట్టలేని స్థితిలో, పోస్ట్ మార్టం పేరుతో నిలువునా కోసిన... పొత్తిళ్లలో పెంచుకున్న కొడుకుని చూసినపుడు ఆ తల్లి స్థితిని ఊహించండి...'

“చావు చాలా భయంకరంగా ఉంది కదూ.... దట్ ఈజ్ చావు”




నీలానగరం అనే ఊరిలో రుద్రయ్య అనే వ్యాపారి ఉండేవాడు. అతడికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడి పేరు పార్ధుడు, చిన్నవాడి పేరు కృష్ణుడు. ఇద్దరిని పెద్ద చదువులు చదివించాడు రుద్రయ్య. చదువు పూర్తయిన తరువాత ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించారు రుద్రయ్య కొడుకులిద్దరూ. తమ అర్హతలకి సరిపడే ఉద్యోగం దొరికే వరకూ తండ్రి దగ్గర వ్యాపారంలో మెలుకువలు నేర్చుకోసాగారు.

పార్ధుడికి తగిన ఉద్యోగానికి రాజాస్థానంలో ఎంపిక ప్రక్రియ జరుగుతోందని తెలిసి అందులో పాల్గొన్నాడు పార్ధుడు. ఉత్తమ ప్రతిభను ప్రదర్శించాడు. తనకే ఆ ఉద్యోగం వస్తుందని అనుకున్నాడు. అయితే ఎంపిక ఫలితం తరువాత చెబుతామని అనడంతో ఇంటికి బయల్దేరాడు పార్ధుడు.

తిరుగు ప్రయాణంలో పార్థుడు ఉండగా మార్గమధ్యంలో ఒక వ్యక్తి పరిచయమయ్యాడు. తన పేరు నందనుడని, రాజధాని పొరుగునే ఉన్న విజయపురం నివాసినని అతడు చెప్పాడు. పార్థుడి కంటే పెద్ద వయసు వాడే కాని ఇద్దరికీ స్నేహం కుదిరింది.

మాటల మధ్యలో తాను వెళ్ళిన పని చెప్పాడు పార్థుడు. అది విన్న నందనుడు "నీకు ఆ ఉద్యోగం వస్తుందని నమ్ముతున్నావా?" అన్నాడు. బాగా ప్రతిభ కనబరిచిన విషయం చెప్పిన పార్థుడు, ఆ ఉద్యోగం తనకే రావచ్చునని చెప్పాడు.

నందనుడు గట్టిగా నవ్వి "ఉద్యోగంపై ఆశలు పెట్టుకోవద్దు. ఇప్పటికే మరొకరికి ఇచ్చేసినట్టు రాజకొలువులో ఉన్న మా బంధువు చెప్పాడు" అన్నాడు.

ఆ మాటలు వినగానే డీలా పడ్డాడు పార్థుడు. నందనుడి మాటలు నమ్మకుండా కొన్నాళ్ళు పాటు ఉద్యోగపు ఫలితం తెలిపే వార్త కోసం ఎదురు చూశాడు పార్థుడు. చాలా రోజులు గడిచినా వార్త తెలియక పోయేసరికి దగ్గరలోని రాజోద్యోగిని కలిసి విషయం చెప్పాడు పార్థుడు. రాజోద్యోగి తనకి తెలిసిన వాళ్ళని సంప్రదించి, ఆ ఉద్యోగంలో వేరెవరో చేరినట్టు, పనిచేస్తున్నట్టు చెప్పాడు. అది వినగానే చాలా బాధపడ్డాడు పార్థుడు.

ఇకపోతే కృష్ణుడు కూడా కొన్ని ఉద్యోగాలకి జరిగిన ఎంపిక పరీక్షలలో పాల్గొన్నాడు. అయితే అందరూ అతడి కంటే ప్రతిభావంతులే వస్తుండడంతో ఉద్యోగం మీద ఆశ వదులుకున్నాడు. అతడి ప్రయత్నాలు గమనించిన ఒక అపరిచితుడు కృష్ణుడిని కలిసి, ధనం సర్దుబాటు చేస్తే ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. అతడు చెప్పింది నమ్మిన కృష్ణుడు తండ్రిని ఒప్పించి ధనం చెల్లించాడు. తరువాత చాలా రోజులు గడిచిపోయినా ఉద్యోగంలో చేరమని కబురు రాలేదు.

అప్పుడు మధ్యవర్తి గురించి వాకబు చేశారు. మధ్యవర్తిగా వ్యవహరించిన వాడు మోసగాడనీ, ఇంతకు ముందు చాలా మందిని మోసగించాడని తెలిసింది. తమ ధనం మీద ఆశ వదులుకున్నారు రుద్రయ్య కుటుంబం. ఉద్యోగమూ రాలేదు, ఇంట్లో ఉన్న ధనం కూడా నష్టపోయామని బాధపడ్డాడు కృష్ణుడు.

ఆ తరువాత కూడా చాలా ప్రయత్నాలు చేశారు పార్థుడూ, కృష్ణుడూ. ఎక్కడా కలిసిరాలేదు.

ఒకరోజు రుద్రయ్య కొడుకుల్ని పిలిచి "మన చాలా వ్యాపారాలలో శ్రద్ధ పెడితే నెల జీతానికి మించి ఇక్కడే సంపాదించవచ్చు" అన్నాడు. తండ్రి మాటల మీద గౌరవంతో వ్యాపారంలో దిగారు అన్నదమ్ములు. వ్యాపారరంగం కూడా అనుకున్నంత సులభం

కాదు. అక్కడా విపరీతమైన పోటీ ఉంది.

తొలిప్రయత్నంలోనే కొందరు రాజోద్యోగులను మంచి చేసుకుని పేదల కోసం నడుపుతున్న అన్నసత్రాలకీ, వసతి గృహాలకీ సరుకులు పంపించే ఒప్పందం పొందారు అన్నదమ్ములు. అనుకున్న రోజుకి పంపడానికి వీలుగా సరుకుల నిల్వలు సిద్ధం చేసారు. చాలా మొత్తం ధనం వాటికి ఖర్చు చేశారు.

అంతలో సరకుల సరఫరా ఒప్పందం మరొక వ్యాపారికి అప్పగించినట్టు కబురు రావడంతో ఎందుకలా జరిగిందో తెలుసుకోవాలని వెళ్ళాడు పార్ధుడు. అక్కడ ఉన్న ఒక ఉద్యోగి "నేను చిన్న పరగణాకి అధికారిని. రాజుగారు పంపించిన వర్తమానం అమలు చెయ్యడం మా బాధ్యత. మంత్రిగారి దగ్గర పలుకుబడి ఉన్న మరొక వ్యాపారి ఈ ఒప్పందం దక్కించుకున్నారని తెలిసింది" అంటూ అశక్తత వ్యక్తపరిచాడు. దాంతో పార్ధుడూ, కృష్ణుడూ పూర్తిగా డీలా పడిపోయి "మేము చేసే ప్రయత్నాలన్నీ వృధా అవుతున్నాయి. నిజాయితీకి విలువే లేదు. జీవితంలో గెలుపు సాధించలేకపోతున్నాం" అన్నారు బాధగా.

ఇలా కాదని, కొడుకులిద్దరినీ పిల్చి కూర్చోబెట్టుకుని ఇలా చెప్పసాగాడు రుద్రయ్య.

"ఈ లోకంలో అవకాశాలకు కొదవలేదు. భూమి మీద పుట్టిన ప్రతిప్రాణికీ తగిన అవకాశం, ఆహారం, పనీ కల్పించాడు దేవుడు. దానికోసం గట్టిగా ప్రయత్నం చేయాలి. ప్రయత్నంలో విఫలమయినప్పుడు కృంగిపోకూడదు. మరొకసారి ప్రయత్నించాలి తప్ప బాధపడుతూ కూర్చోకూడదు. అలాగని అంత తేలిగ్గా అందితే ఎవరికీ దేని విలువా తెలిసే అవకాశమే లేదు. దేనికైనా మనలాగే పదిమందీ ప్రయత్నించినపుడు ఖచ్చితంగా పోటీ ఏర్పడి తీరుతుంది....

ఎవరికున్న దారులను వారు ఉపయోగించి ప్రయత్నించినపుడు, మనకున్న దారులేమిటీ...అవెంతవరకు మనకుపయోగపడతాయని ఆలోచించుకుని ముందుకు సాగాలి.......మీరు కొత్తగా వ్యాపారం మొదలు పెట్టాలనుకుంటున్న సమయంలో మీకింకా ఆర్థికంగా నా అండ, నేను సంపాదించి పెట్టిన మంచిపేరు ఎంతో కొంత ఉన్నాయి. అదే నేను మీ వయసులో బ్రతుకు దెరువు కోసం ఊరూరా సరుకులు తీసుకుని తిరిగే సమయంలో నాణ్యతను చెప్పినా ఎవరూ నమ్మేవారు కాదు. వారిని నమ్మించడంకోసం సరుకులు అరువుగానే ఇచ్చి వాళ్ళకు సంతృప్తి కలిగిన తర్వాతే మళ్ళీ వెళ్ళి తీసుకోవాల్సి వచ్చేది... అంతకంటే మీరెన్నిరెట్లు మీరే ఆలోచించుకోండి.....

నోరు జారిన మాట , ఎగిరి పోయిన పక్షి, గతించిన కాలము, పోగొట్టుకున్న అవకాశం తిరిగి లభించడం కష్టం. కాబట్టి జరిగిన దానిని తలచుకుని బాధ పడడం కంటే ఆ విషయం మరిచిపోయి కొత్త ఉత్సాహంతో మళ్ళీ ప్రయత్నించాలి. తరువాత ప్రయత్నంలో

విజయం తప్పక వరిస్తుంది. ఆలస్యం అవుతుందేమో కానీ సఫలీకృతులవడం ఖాయం’.

తండ్రి మాటలతో నూతన ఉత్సాహం తెచ్చుకుని మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి  అనుకున్నది సాధించారు పార్థుడు, కృష్ణుడు.




ఎనిమిదవ తరగతి చదువుతున్న కొడుకు వినోద్ అడిగిన ప్రశ్నతో నోటమాట రానట్టయ్యి అవాక్కయ్యి, ఆలోచనలో పడింది సుమతి. నిన్న జరిగిన సంఘటన్ గుర్తు చేసుకుంది..

*************

క్లినిక్ ముందు ఆగిన ఆటో లోంచి దిగారు సుమతి, భాస్కర్ లు. నీరసంతో అడుగులు వేయలేక ఇబ్బంది పడుతున్న భర్త భాస్కర్ చేయిని పట్టుకుని మెల్లగా నడిపించుకుంటూ వెయిటింగ్ రూం లో వున్న కుర్చీలో కూర్చోబెట్టింది సుమతి.

రెండు నెలలుగా విపరీతమైన ఒళ్ళునొప్పులు, తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు భాస్కర్.కానీ, పారాసెటామాల్ టాబ్లెట్స్, పెయిన్ కిల్లర్ మెడిసన్స్ వేసుకోవడంతో, తాత్కాలికంగా జ్వరం తగ్గుతూ మళ్ళీ రెండు-మూడు రోజులకు విపరీతంగా వస్తూ బాగా

నీరసించిపోవడంతో భయం వేసి, ఆఫీస్ కి లీవ్ పెట్టించి భర్తను తీసుకుని హాస్పిటల్ కి వచ్చింది సుమతి.

డాక్టరు గారు రాసిచ్చిన అన్ని టెస్టులూ చేయించేసరికి మధ్యాన్నం పన్నెండు దాటింది. అన్ని టెస్టుల రిపోర్ట్ లు చూసిన డాక్టరు గారు టైఫాయిడ్ అని కంఫర్మ్ చేసి, రెండు నెలలుగా గుర్తించకపోవడం వల్ల బాగా నీరసించి పోయిన భాస్కర్ ని మందలించి నెలరోజులు పూర్తిగా రెస్టు తీసుకోవాలనీ, అలాగే మంచి బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలనీ చెప్పి మెడిసన్స్ రాసి పంపిచివేసారు.

ఇద్దరికీ బాగా ఆకలి వేస్తూండడంతో ప్రక్కనే వున్న హోటల్లోకి వెళ్ళి వేడి వేడి పాలు ఆర్డర్ చేసి బ్రెడ్ ప్యాకెట్ కొని ఇద్దరూ తిన్నారు. కొంచం ఓపిక వచ్చింది ఇద్దరికీ. ఆ తరువాత ఆటో మాట్లాడుకుని ఇంటికి తిరిగి వచ్చారు.

వచ్చీరాగానే జావ ఇచ్చి టాబ్లెట్స్ వేసింది సుమతి.

వెంటనే మగతలోకి జారుకున్నాడు భాస్కర్. కానీ సుమతికి నిద్రపట్టలేదు. అన్యమనస్కంగా ఇంటి పనులు పూర్తి చేసింది.

భాస్కర్, సుమతి వాళ్ళది మధ్యతరగతి కుటుంబం. భాస్కర్ పనిచేసేది ప్రైవేట్ కంపెనీ కావటాన, వచ్చిన జీతాన్ని పొదుపుగా ఖర్చు చేసుకుంటూ గుట్టుగా సంసారం చేస్కుంటున్నారు. వాళ్ళకిద్దరు పిల్లలు, వినోద్, లలిత. వినోద్ ఎనిమిదవతరగతి, లలిత ఐదవ తరగతి. చదువుతున్నారు.

ఆ రాత్రి భోజనం చేయగానే నిద్రపోయింది లలిత. వినోద్ మాత్రం స్కూల్లో ఇచ్చిన హోం వర్క్ చేసుకుంటున్నాడు. తల్లిదండ్రుల దగ్గర కూర్చుని.

మౌనంగా కూర్చుని వున్న భార్యను చూస్తే జాలేసింది భాస్కర్ కి.

" డాక్టర్లు అలానే అంటారు సుమతీ! నెలరోజులపాటు రెస్టు తీసుకుంటూ ఇంట్లోనే వుంటే జీతం ఎలా వస్తుంది? అందులోనూ నేను చేసేది ప్రైవేట్ జాబ్ " అన్నాడు...

" వద్దండి, ఆఫీసుకి లీవ్ పెట్టేయండి ఇప్పటికే పాపం, ఒంట్లో బాగోలేకున్నా లెక్కచేయకుండా శ్రమపడడం వల్ల బాగా నీరసించిపోయారు. ఇప్పుడుకూడా మీరు డాక్టర్ చెప్పినట్టు వినకుండా ఆఫీసుకు వెళితే ఇంకేమన్నా వుందా?" అంది సుమతి.

" అలా అంటే ఎలా సుమతి, మనకు ఈ జీతం కాక వేరే ఆదాయ మార్గాలేవీ లేవు కదా " అన్నాడు బాస్కర్.

మౌనంగా ఉండిపోయింది సుమతి. అవును, భర్త చెప్పింది నిజమే, తమలాంటి మధ్యతరగతి వాళ్ళూ, చిన్న-చితకా ఉద్యోగం చేసుకుంటూ బ్రతుకు బండిలాగే వాళ్ళూ, అనారోగ్యం వల్ల కానీ, అనుకోని అవాంతరాల వల్ల కానీ, పంలోకి వెళ్ళకపోతే అంతే, ఆ నెల జీతం ఇవ్వరు....కానీ...

జీతం రానంత మాత్రాన నిత్యావసరాలు, ఖర్చులు ఆగిపోతాయా? పాలకి, ఇంటద్దెకీ, కరెంట్ బిల్లులకీ, నెలవారీ సామాన్లకి అన్నింటికీ డబ్బులు కావాలి అన్నీ ఖర్చులూ తప్పనిసరివే!

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి సుమతికి. తను జాగ్రత్తగా పొదుపు చేసి దాచుకున్న డబ్బులు మహా అయితే పది రోజులు సరిపోతాయి. ఆ తర్వాత ఎలా..? ఏమీ పాలుపోవడం లేదు.

అమ్మానాన్నలను అడుగుదామన్నా వాళ్ళ పరిస్థితీ అంతంత మాత్రమే. అందుకే, భర్తకు చేదోడు-వాదోడుగా వుంటుందని తను కూఒడా ఏదైనా స్కూళ్ళో జాయిన్ అవుదామని ఎంతో ప్రయత్నించింది కానీ, ఆమె చదివింది తెలుగు మీడియం అవటానైప్పుడు అన్ని స్కూళ్ళల్లో ఇంగ్లీషుమీడియం చదివిన వారికే ప్రయారిటీ ఇవ్వటాన తను ఎన్ని స్కూళ్ళల్లో అప్లై చేసినా ఇంటర్వ్యూ కాల్స్ రావటంలేదు.భార్య తీవ్రంగా ఆలోచిస్తుందని గ్రహించి, మెల్లగా వచ్చి ఆమె భుజంపై చేయి వేసి అన్నాడు భాస్కర్..

" సుమతీ ! మందులు వేసుకుంటూ టైముకి భోజనం చేస్తూ వుంటే రోజూ ఆఫీసుకి వెళ్ళినా ఏమీ కాదు. నాకు ఇప్పుడు చాలా హుషారుగా వుంది. బహుశా, మెడిసన్స్ వేస్కున్నాను కదా, రేపు నేను ఆఫీసుకు వెళ్తాను..." అన్నాడు.

ఓపిక లేకపోయినా తాము ఎక్కడ ఇబ్బంది పడతామో అని, లేని ఓపిక నటిస్తున్న భర్తను చూసి బాధేసింది సుమతికి.

" అసలు ఇదెక్కడి న్యాయమండీ? మనిషన్నాక రోగాలు, జబ్బులూ రానే రావా? అంత మాత్రాన ఒక నెల రోజులపాటు ఆఫీసుకు లివ్ పెడితే ఆ నెల జీతం కాస్తా కట్ చేస్తారా? ఇదెంతవరకూ సబబు? ఇదసలు కరెక్టేనా?కావాలని ఎవరూ ఇంట్లో ఖాళీగా కూర్చోరుగా...కనీసం ఆరోగ్యం బాగోలేదని జెన్యూన్ కేసుల్లో అయినా చూసీ-చూడనట్టు యాజమాన్యం ప్రవర్తిస్తే ఎంత బాగుంటుంది? " అని ఆవేశంగా మాట్లాడింది సుమతి.చిన్నగా నవ్వి ఊరుకున్నాడు భాస్కర్. ఎందుకంటే సుమతి ఆవేశం అర్థం లేనిది అనిపించింది. ఆఫీసులో ప్రతి ఒక్కరూ ఇదే అనారోగ్యం కారణంగా నెలరోజులచొప్పున లీవులు పెడుతూ జీతాలు కావాలంటే వాళ్ళ కంపెనీలు బాగుపడ్డట్టే..అనుకున్నాడు మనసులో.చేసుకుంటున్న హోం వర్క్ ఆపేసి అమ్మానాన్నల మాటలన్నీ అక్కడే వుండి వింటున్న వినోద్, తల్లి ఆవేశం చూసి నిజమేకదా నెలనెలా వచ్చే జీతం రాకుంటే ఆ నెల ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. " రెక్కాడితే కానీ డొక్కాడని బ్రతుకులు తమవి..." అని అని కూడా అనిపించింది పాపం ఆ చిన్ని మనసుకి. ఎలాగైనా కష్టపడి చదివి, మంచి ఉద్యోగం సంపాదించాలని బలంగా నిర్ణయించుకున్నాడు. రాత్రంతా కలత నిద్రలోనే వున్నాడు....

మర్నాడు ఉదయం....

స్కూలుకి వెళ్ళడానికి తయారవుతూ తల్లి, గిన్నెలు తోమడానికి వచ్చిన పనిమనిషి రంగమ్మను అరుస్తుంటే ఏమిటాని వినసాగాడు." ఏంటి రంగమ్మా ఇది..? పదిరోజులుగా పన్లోకి రాలేదు..కనీసం మాటమాత్రమైనా చెప్పలేదు..." కోపంగా అంది సుమతి.

"అస్సలు పది రోజులుగా పానం బాగోలేదమ్మగోరూ ఒకటే జరం..నిన్ననే గవుమెంటు ఆసుపత్రికి ఎల్లి మందులు తెచ్చుకుని ఏసుకున్నాను...కొంచెం ఓపికొచ్చింది....అందుకే గబగబా వచ్చాను" మెల్లిగా అంది రంగమ్మ్.

" ఏమో..అదంతా నాకు తెలీదు...ఈ పదిరోజులు డబ్బులు కట్ చేసి ఫస్టుకి మిగతాడి యిస్తాను. అంతే కాదు ఇంకోసారి ఇన్నిరోజులు ఎగ్గొడితే వేరే మనిషిని పెట్టుకుంటాను, నీ ఇష్టం " అని కటువుగా చెప్పేసి " చ...కొంచెం అలుసిస్తే చాలు నెత్తికెక్కుతారు ఈ అలగా జనం...." అని మెల్లగా గొణుక్కుంటూ ముందు గదిలోకి వచ్చింది సుమతి.

" అమ్మా, పనిమనిషి మాత్రం మనలాంటి మనిషి కాదా? " అని సూటిగా ప్రశ్నించాడు వినోద్.

" నాన్నగారి జీతం కట్ చేస్తారని నువ్వు రాత్రి ఎంతో బాధపడ్డావు. మరి అదే అనారోగ్యం కారణంగా రాలేకపోయిన రంగమ్మను ఎందుకు అరుస్తున్నావు?" అని అడిగి తల్లి ఏం చెబుతుందో కూడా వినకుండా వెంటనే తయారు చేసి వుంచిన లంచ్ బాక్స్ అందుకుని గబగబా బైటకు వెళ్ళి స్కూల్ బస్ ఎక్కేశాడు వినోద్.

" చ...ఎంత తొందరపడింది తను రంగమ్మ పట్ల...? ఎంత చక్కగా వివరించాడు తనకొడుకు తను చేసిన తప్పుని..." అనుకుంది సుమతి.వెంటనే ఇంటివెనుక అంట్లు తోముతున్న రంగమ్మ దగ్గర్కొచ్చి " ఇప్పుడెలా వుంది రంగమ్మా ఒంట్లో..." అని అడిగి తాము తినగా మిగిలిన ఉప్మా ఆమెకి తినమని ఇచ్చింది.

పని పూర్తి చేసుకుని తిరిగి వెళుతున్న రంగమ్మతో " పదిరోజుల డబ్బులు కట్ చేయనులే...కంగారు పడకు..." అని నవ్వుతూ చెప్పిన సుమతి వంక విస్తుపోతూ చూసింది రంగమ్మ....అంతేకాదు, తనదగ్గరున్న వంద కాగితం ఆమెకిచ్చి మందులు కొనుక్కోమని చెప్పింది." చల్లగా వుండాలమ్మా" అని దణ్ణం పెట్టి వెళ్ళింది రంగమ్మ.....

************

నీరసంతోటే ఆఫీసుకి వెళ్ళిన భాస్కర్ లంచ్ టైం లో ఇంటికి తిరిగి వచ్చాడు ఆనందంగా. అప్పుడే వచ్చారేంటి..? అని అడిగిన సుమతితో, " పదిగంటలకు టీటైం లో కళ్ళుతిరిగి పడిపోవడంతో మా ఎం డీ గారు చూసి, నాకు ఇరవై రోజులు లివ్ శాంక్షన్ చేసారు. వితవుట్ లాస్ ఆఫ్ పే...ఆ ఇంకో గుడ్ న్యూస్...అనుకోకుండా లాభాలు రావడంతో రెండునెలల జీతం బోనస్ గా ఇస్తామని మా బాస్ చెప్పరు..." అని సంతోషంగా చెబుతున్న భర్తని చూసి ఎంతో ఆనందం కలిగింది సుమతికి. రెండు వైపులా పారదర్శకంగా చేసే మంచి ఆలోచనలకు భగవంతుడెప్పుడూ మంచి ఫలితాలనే ఇస్తాడు అని మనసులోనే భగవంతుడికి దణ్ణం పెట్టుకుంది...చిన్నవాడైనా ఎంతో పెద్ద సత్యాన్ని తనకు ఒకచిన్న మాట ద్వారా తెలియజేసిన తన కొడుకుని మనసులోనే అభినందించింది.




“ చెరువులోని చేప ఆ చెరువుతోనే ప్రేమలో పడింది.

‘నువ్వు నా కన్నీళ్లను చూడలేకపోతున్నావు. దేనికంటే నీలోనే నేను ఉన్నాను కాబట్టి” అంది.

దానికి చెరువు బదులిచ్చింది.

‘ నేస్తమా… నిజంగా నువ్వు నాలోనే ఉన్నావు. అందుకే నీ కన్నీళ్లను నేను ఫీలవగలుగుతున్నాను.

చెరువు, చేపల ప్రేమానుబంధం బలే గమ్మత్తుగా ఉంది కదూ..”

ఏకదంతం చెప్పుకుపోతున్నాడు ఏకధాటిగా.

“ఏం చెప్పావురా… అద్భుతంగా ఉంది…” పక్కనున్న వాళ్లంతా కేరింతలు కొట్టారు.

fఅదే ఊపులో ఏకదంతం చెప్పాడు.

“ప్రేమ అజరామరం. అద్వితీయం.. ప్రేమకు మరణంలేదు. జీవితంలో ప్రేమను పొందలేనివాడంత దురదృష్టవంతుడు ఇంకోడు ఉండడు. చరిత్రలో ఎన్నెన్ని ప్రేమ కథలున్నాయో…

ఆంటోనీ-క్లియోపాత్రా, రోమియో-జూలియట్, షాజహాన్- ముంతాజ్, ఆల్బర్ట్- క్వీన్ విక్టోరియా, లైలా-మజ్ను, దేవదాసు-పార్వతి… ఒక్కొక్కరిది ఒక్కో ప్రేమ కథ…

వాడు చెప్పేది ఆసక్తికరంగా అనిపించింది.

“ చివరి ఇద్దరి గురించి మాకు తెలుసు. మిగిలిన వాళ్ల గురించి చెప్పరా బాబూ…” అడిగాడు సుబ్బు.

వాడు అడగటం పూర్తికాలేదు. ఏకదంతం అందుకున్నాడు.

“బతుకులోనే కాదు, మరణంలోనూ సహజీవనం అన్న సూత్రం ఆంటోనీ,క్లియోపాత్రాలకు వర్తిస్తుంది. ఆంటోనీ ,క్లియోపాత్రాలు తొలిచూపులోనే ప్రేమలో పడతారు. ఈజిప్టులో వారి నివాసం. రోమన్లకు వారి ప్రేమ కంటగింపుగా మారుతుంది. అందుకే అనేక అవాంతరాలు సృష్టిస్తారు.. ఇవేం లెక్కచెయ్యని ఆ జంట పెళ్లిచేసుకున్నారు. ఈలోగా యుద్ధం వచ్చింది. క్లియోపాత్రా యుద్ధంలో చనిపోయిందన్న అబద్ధం ప్రచారం చేస్తారు. అది ఆంటోనీ చెవిలోపడుతుంది. అది వాస్తవమో కాదో అని ఏమాత్రం నిర్ధరించుకోకుండా కత్తిమొన పైన కూలపడి ప్రాణం విడుస్తాడు. ఆంటోనీ కన్నుమూసిన వార్త క్లియోపాత్రా చెవిన పడుతుంది. ఆమె కూడా దేహత్యాగం చేస్తుంది. నిజ జీవిత పాత్రలయిన ఆంటోనీ, క్లియోపాత్రాలకు ప్రసిద్ధ రచయిత షేక్స్ పియర్ చిరస్మరణీయమైన కీర్తిని సంపాదించిపెట్టారు”

అనర్గళంగా చెప్పుకుపోతున్న ఏకదంతం వైపు విస్మయంగా చూస్తుండిపోయాం.

“ షేక్స్ పియర్ రాసిన మరో ట్రాజెడీ నవలలో రోమియో, జూలియట్ పాత్రలు కనిపిస్తాయి . బద్ధవిరోధులయిన రెండు కుటుంబాలకు చెందిన వారసులు వీళ్లిద్దరు.

ప్రేమ, పెళ్లి, అన్యోన్యదాంపత్యం, ఒకరికోసం మరొకరు ప్రాణత్యాగానికి సిద్ధపడటం వంటివి ఇందులో ఉంటాయి. ప్రేమ కోసం ఇద్దరు ప్రాణ త్యాగం చేస్తారు. చివరికిపెద్దలకు కనువిప్పు కలుగుతుంది. ప్రేమ త్యాగాన్ని కోరుతుందని ప్రతి ప్రేమికుడు భావించటం వెనుక ఈ పుస్తకం కలిగించిన ప్రేరణ అని చెప్పవచ్చు. నిజమైన ప్రేమకు నివాళిగా ఈ పాత్రలు మిగిలిపోయాయి”.

ఆ నిముషంలో మా అందరి మనసుల్లో ప్రేమ పట్ల గౌరవభావం పెరిగింది.

“ ప్రేమస్మారకం తాజ్ మహల్ గురించి మీకు తెలుసుగా..

మొగల్ చక్రవర్తి షాజహాన్ తన జీవిత భాగస్వామి పేరు చిరస్థాయిగా నిలిచిపోవటానికి యమునా నది ఒడ్డున ఈ కట్టడాన్ని నిర్మించారు. 20 ఏళ్లపాటు దాదాపు 20 వేల మంది కార్మికులు దీని నిర్మాణ పనుల్లో పాల్గొన్నారు. వెయ్యి ఏనుగుల్ని ఉపయోగించి వస్తువుల్ని రవాణా చేశారు. ప్రపంచ వింతల్లో ఒకటిగా మిగిలిపోయింది”.

మాకు తెలిసిన విషయమే అయినా-

వాడు చెప్పింది వింటుంటే గమ్మత్తుగా అనిపించింది.

“పదిహేనేళ్ల వయసులో షాజహాన్, టీనేజిలో ఉన్న ముంతాజ్ (అసలు పేరు అర్జుమన్) ను పెళ్లాడాడు. వారి ప్రణయం అజరామరం. ఇద్దరు కలిసి పదిహేడు సంవత్సరాలు దాంపత్యజీవితాన్ని అనుభవించారు. 14 మంది పిల్లల్ని కని ఆమె కన్నుమూసింది. ఆమె జ్ఞాపకంగా తాజ్ మహల్ నిర్మాణానికి సంకల్పించిన షాజహాన్ తనకు కూడా అందులో ఓ గోరీని కట్టుకోవాలని సంకల్పించినా అది సాధ్యపడలేదు. ఆయన తర్వాత అధికారంలోకొచ్చిన ఆయన కుమారుడు ఔరంగజేబు తండ్రిని చెరసాల పాలు చేశాడు. ఆగ్రా రెడ్ ఫోర్టులో శిక్ష అనుభవిస్తూనే షాజహాన్ గంటల కొద్దీ సమయం తాజ్ మహల్ చూస్తూ గడిపేవాడు.

మరణానంతరం షాజహాన్ ను ముంతాజ్ సమాధి పక్కనే పూడ్చిపెట్టారు.

తాజ్ మహల్ ఓ సమాధి అని చెప్పటం దాని స్థాయిని తగ్గించటమే అవుతుంది ”.

“ అది సరేరా.. క్వీన్ విక్టోరియా గురించి చెప్పు...” మాటల మధ్యలో అడ్డు పడ్డాడు ఇంకో రూమ్మేట్.

“ బ్రిటన్ చరిత్రలో క్వీన్ విక్టోరియా ప్రేమ సుస్థిరంగా నిలిచిపోయింది...” అన్నాడు ఏకదంతం...

ఇది పూర్తిగా కొత్త విషయం కావటంతో చెవులు రిక్కించి మరీ విన్నాం.

“ క్వీన్ విక్టోరియా 1837లో ఇంగ్లాండు పీఠాన్ని అధిరోహించింది. ఆమెకు చిత్రలేఖనం అంటే విపరీతమైన ఇష్టం. అధికారం చేపట్టిన మూడేళ్లకు ఆమె తన సమీప బంధువు ఆల్బర్టును వివాహమాడింది. ఇద్దరూ అన్యోన్యంగా గడిపేవారు. వారి ప్రేమకు గుర్తుగా తొమ్మిది మంది సంతానం కలిగారు. ఆల్బర్ట్ జర్మన్ కావటంతో సహజంగానే అతనిపైన కుటుంబంలో వ్యతిరేకత ఉండేది. విక్టోరియా మాత్రం అతని వ్యక్తిత్వాన్ని ఇష్టపడేది. పాలనలో అతని సలహాలను స్వీకరించేది. 1861లో ఆల్బర్టు హఠాత్తుగా కన్నుమూశాడు. అంతే విక్టోరియా కుంగిపోయింది. మూడేళ్లపాటు బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా గడిపింది. తర్వాత ప్రధాన మంత్రి సలహాతో పాలనబాధ్యతలు స్వీకరించి జనరంజకంగా పాలించింది. ‘రవిఅస్తమించని బ్రిటిషు సామ్రాజ్యం’ అన్న నానుడి ఆమె హయాంలోనే మొదలయ్యింది. భర్త జ్ఞాపకాలతో జీవిస్తూ తను మరణించేవరకూ నల్లటి దుస్తులనే ధరించేదట . ”

ఏకదంతానికి ఇదంతా మామూలే. హాస్టల్లో మమ్మలందర్నీ పోగేసి గంటల కొద్దీ సమయం ప్రేమ గొప్పతనం గురించి మాట్లాడుతూంటాడు. అందుకే ముద్దుగా మేమంతా వాడిని లవ్ గురు అని పిలుచుకుంటాం. వాడు చెప్పే ప్రేమ కథలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

“ నేను ముందుగా ఓ అమ్మాయిని గాఢంగా ప్రేమించి... ఆ తర్వాత ఆమెనే పెళ్లి చేసుకుంటా...” అన్నాడోసారి.

“ ఇంత పెద్ద కాలేజీలో నీకు నచ్చినమ్మాయి దొరకలేదా?” ఎవరో అడిగారు.

“ లేదు రా బాబూ... మిగతా వాళ్ల ప్రేమ వ్యవహారాలు చక్కదిద్దటానికే నా సమయం అంతా సరిపోతోంది...” విచారపడుతున్నట్టుగా చెప్పాడు ఏకదంతం.

అవతలున్న వ్యక్తి కవ్వింపుగా చెప్పాడు.

“ ఫైనల్ ఇయర్లో ఉన్నాం. ఇంకో రెండు నెలలయితే పరీక్షలయి పోతాయి. ఆ తర్వాత ఉద్యోగాల వేటకే సరిపోతుంది. ప్రేమకు చోటెక్కడుంటుంది. ”

“ సరైన వ్యక్తి దొరికేవరకూ నా అన్వేషణ కొనసాగుతుంది. ప్రేమపైన నాకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను ” ధీమాగా చెప్పాడు ఏకదంతం.“మేం ప్రేమించుకున్నాం. తల్లిదండ్రులు మా ప్రేమను అంగీకరించటంలేదని ఎవరయినా చెబితే చాలు... ఏకదంతం ఆఘమేఘాలమీద బయలుదేరతాడు.

నలుగురైదుగురు స్నేహితులను వెంటేసుకుని మరీ...

రెండ్రోజుల క్రితం సెకండియర్లో ఉన్న జ్యోత్స్న,పాల్ రాజులు ప్రేమించుకున్నామంటూ ఏకదంతం దగ్గర కొచ్చారు.

ఒకరు చర్చిలో పెళ్లి చేసుకుందామంటే... మరొకరు ఆర్యసమాజ్ అయితే నయం అన్నారు. గొడవ ఎంతకీ కొలిక్కిరాలేదు.

“ నీకు తెలుసా... అమ్మాయి తండ్రికి పొలిటికల్ లింకులున్నాయి. ఫ్యాక్షనిస్టు ముద్ర కూడా ఉంది. లేనిపోని వ్యవహారాల్లో జోక్యం చేసుకుని ప్రాణంమీదకు తెచ్చుకోకు” రిస్కని తెలిసి ముందుగానే వాడికి సలహా ఇవ్వబోయాను.

ఏకదంతం ససేమిరా అన్నాడు.

“అవతల వాడు ఎంత పెద్దవాడయినా సరే... ప్రేమికుల జంటను ఒకటి చేసి తీరతాను”      పట్టుదలగా చెప్పాడు.

“ అదికాదురా..లేనిపోని విషయాల్లో తలదూర్చి కష్టాలు కొనితెచ్చుకోవటం దేనికి? అసలే మీ పేరెంట్స్ మొన్న గట్టిగా చెప్పారన్నావు      కూడా. ఒకటికి రెండు సార్లు ఆలోచించుకో... ”

“ ఆలోచించటానికేం లేదు. రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లి చేసేద్దాం... సాక్షి సంతకాలు పెట్టాలి. నువ్వూ రా...” అంటూ బలవంతంగా నన్నూ లాక్కుపోయాడు.

అంతకు ముందు ఏం చేశాడో తెలిదుగానీ..

మర్నాడు అటు అమ్మాయి తల్లిదండ్రులు, ఇటు అబ్బాయి తల్లిదండ్రులు కూడా అక్కడికొచ్చి కొత్త జంటను తమ వెంట తీసికెళ్లారు.

రెండ్రోజుల తర్వాత భారీస్థాయిలో రిసెప్షన్ ఏర్పాటు చేశారు.

“ ఏకదంతం లేకపోతే మేము ఒకటయ్యేవాళ్లం కాదు. నిజంగా మేం తనకి రుణపడిఉన్నాం” - పెళ్లి కుమార్తె సభాముఖంగా చెప్పినప్పుడు ప్రేమను గెలిపించిన తృప్తి వాడిలో కనిపించింది.

మా కాలేజీలో ఉన్న ప్రేమికులంతా వాడిని ఏదో సందర్భంలో కలసి సలహాలడుగుతూంటారు.

“ గురూ.. ఎన్ని ప్రేమలేఖలు రాసినా పట్టించుకోవటం లేదు.. మొహాన్నే చీకొడుతోంది’ అనో..

“ నన్ను ప్రేమించమని వేధిస్తున్నాడు. రక్తంతో ప్రేమలేఖ రాశాడు అన్నయ్యా..” అనో      .. అబ్బాయిలు, అమ్మాయిలు కలసి చెబుతూండటం..వాడే మంత్రం వేసేవాడో తెలిదుగానీ..

కొట్టుకునే జంట కాస్తా పరస్పరం ప్రేమించుకునే పరిస్థితి వచ్చేసేది.

నాకిదంతా విచిత్రంగానూ, అద్భుతంగానూ అనిపించేది.

“ గురూ... వాలంటైన్సుడే సందర్భంగా తాజ్ లో ప్రేమజంటల పరిచయకార్యక్రమం పెట్టారు. దానితో పాటు వక్తృత్వ పోటీ కూడా ఉందట. ‘ప్రేమ ఎంత మధురం’ అన్న పేరుతో. నాకు తెలిసి ప్రేమ గురించి నీకంటే గొప్పగా చెప్పగలిగిన వ్యక్తులెవరూ లేరు. దాదాపుగా ప్రధమ బహుమతి నీకే...” బీకామ్ స్టూడెంటొకరు వచ్చి చెప్పటంతో చర్చకు ఫుల్ స్టాప్ పడింది. ఎవరు దారిన వాళ్లం వెళ్లిపోయాం.

--------------------------------------------------

ఆ రోజు ప్రేమ గురించి చాలా అద్భుతంగా మాట్లాడాడు ఏకదంతం..

వాడు చెప్పిన విషయాలు కొత్తగా అనిపించాయి. బోలెడన్ని సంఘటనలు ప్రసిద్ధుల సూక్తులతో రంగరించి కార్యక్రమాన్ని రక్తకట్టించాడు.“టాప్ టెన్ రొమాంటిక్ మూవీస్ మీకు తెలుసా...?” అంటూ చర్చ ప్రారంభించాడు.అందరూ ఆలోచనలో ఉండగానే..“ దినోట్ బుక్, ఎ వాక్ టు రిమెంబర్, టైటానిక్, స్టెప్ అప్, ప్రైడ్ అండ్ ప్రెజ్యుడిస్, 50 ఫస్ట్ డేస్, రోమియో అండ్ జూలియట్, డియర్ జాన్, ట్విలైట్, ఎటర్నల్ సన్ షైన్ ఆఫ్ ది స్పాట్ లెస్ మైండ్...” అంటూ వాడే చెప్పేశాడు.

“ ప్రేమ పైన ఆరుపదాలను ఎనిమిది రకాలుగా ఉపయోగించి ఓ బీటిల్ రూపొందించాడు కోల్ పోర్టర్. 1921లో రూపొందించిన ఈ గీతం విపరీతమైన ప్రజాదరణ పొందింది. ఒకసారి మీరూ ఆస్వాదించండి...

అంటూ.. వాడు చెబుతుంటే ఆడిటోరియంలో చప్పట్లు మారుమోగాయి.

What? is this thing called love...

What is this thing called... LOVE

what is this thing? called love

What .. Is this thing called love

what IS this thing called love...

what is THIS thing called, Love..

what is THIS THING CALLED... love...”

“ప్రేమ లేకపోతే జీవితం శూన్యం. రోజులు తమ ఉనికిని కోల్పోతాయని చెబుతూ ఓ ప్రేమికుడు తన ప్రేమికురాలికి ఇలా ఎస్ ఎమ్ ఎస్ పంపాడు.

With out love, dayz are,

Saddy, moonday, Tearday, Wasterday, Tlurist day, Fright day, shatter day

so be in LUV every day.

wish you a very happy valentine day.”

మళ్లీ చప్పట్లు...

“ప్రేమ విద్యను నాశనం చేస్తుందంటారు గానీ.. నిజమైన ప్రేమికులు తమ వృత్తిలోనూ ముందడుగు వేస్తారు.

ఈ మాట మీకు ఆశ్చర్యం కలిగించవచ్చుగానీ.. మేరీ క్యూరీ,పేరీ క్యూరీ ల గురించి మీరు విన్నారా?

‘ఆ.. విన్నాం.. వాళ్లిద్దరు శాస్త్రవేత్తలు కదా...” ముందువరుసలో ఎవరో అరిచారు.

ఏకదంతం మెచ్చుకోలుగా వాళ్లవంక చూశాడు.

“పోలండ్ యూనివర్సిటీ ఆడవాళ్లను చేర్చుకోటానికి నిరాకరించటంతో మేరియా స్లొండ్ స్కా క్యూరీ పారిస్ తరలివచ్చింది. ప్రయోగశాలలో ఎక్కువ సమయం గడిపేది. అదే సమయంలో ఆమెతో పాటు అధ్యయనంలోనూ, వివిధ ప్రయోగాల్లో భాగస్వామి అయిన పేరీ క్యూరీని ఆమె ఆకర్షించింది. ఇద్దరి ప్రేమ మధ్య ప్రేమ వికసించింది. పేరీ పెళ్లి ప్రతిపాదన చేశారు. కొన్నేళ్లు వేచి చూశాక ఆమె అంగీకరించింది. 1895 లో ఈ ఇద్దరు ప్రేమికులు జీవిత భాగస్వాములయ్యారు. పరిశోధనల్లో అవిశ్రాంతంగా కృషి చేశారు. పోలోనియం, రేడియం కనుగొన్నారు”.

సైన్సు విద్యార్థులు ఇదంతా తమకు తెలిసిన విషయమే అన్నట్లు చూశారు.

“మరో శాస్త్రవేత్తతో కలసి రేడియోధార్మికత కనుగొన్నందుకు గానూ, పేరీ భౌతిక శాస్త్రంలో నోబుల్ ప్రైజ్ సాధించారు. మరో రెండేళ్లకు ఆయన మరణించాడు. భర్త మరణించిన తర్వాత కూడా మేరీ తన పరిశోధనలు కొనసాగించారు. ఆమెకు నోబుల్ ప్రైజ్ లభించింది. రసాయనశాస్త్రంలో తొలినోబుల్ ప్రైజ్ సాధించిన మహిళగా చరిత్రకెక్కింది. మేరీ, పేరీ క్యూరీ జంట శాస్త్రవేత్తలయిన ప్రేమికులుగా చిరస్మరణీయులు.”

మరో మూడు నిముషాల పాటు తన ప్రసంగాన్ని కొనసాగించాడు.

“ప్రేమ ఉదంతాలన్నీ విషాదాంతాలు కావలసిందేనా?

ప్రేమికులు ఒకటి కాకూడదా? పెళ్లి చేసుకుని సుఖంగా సంసారం చేసుకోకూడదా?

రచయితలు, దర్శకులు ఇలా ఎందుకు సినిమాలు తీస్తున్నారు?

ప్రేమ త్యాగాన్ని కోరుతుంది లాంటి డైలాగులు ట్రాష్... ”

హాలంతా ఈలలు, చప్పట్లు… నిర్విరామంగా.

జడ్జిలు మెచ్చుకోలుగా చూశారు.

మేమంతా ఊహించినట్టుగానే ప్రథమబహుమతి కొట్టేశాడు ఏకదంతం.

అదే రోజు రాత్రి బ్లూమూన్ రెస్టారెంట్లో భారీ పార్టీ ఇచ్చి మమ్మల్ని ఆనందింప చేశాడు కూడా.

ఈ కథ ఇలాగే కొనసాగితే ఎలా ఉండేదో సరిగ్గా రెండు నెలలకి అనుకోని మలుపు తిరిగింది.

ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసి ఎవరి ఊళ్లకి వాళ్లు వెళ్లిపోయాం.

ఓ రోజు ఉదయానే సుబ్బు నాకు ఫోన్ చేశాడు.

“ ఒరే.. ఏకదంతం పెళ్లట… మొన్నా మధ్య వాళ్ల నాన్న మా ఫాదర్ కి కనిపించి ఈ విషయం చెప్పాడట…” ఉత్సాహంగా అన్నాడు.ఎందుకో తెలిదు. ఏకదంతం చేసుకోబోయే అమ్మాయి ఎవరో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది.

ఖచ్చితంగా ఆ అమ్మాయి వాడు ప్రేమించిన వ్యక్తే అయి ఉంటుంది.

నిజంగా ఆమె అదృష్టవంతురాలు.. మనసులో ఆలోచించుకుంటూనే “… పెళ్లి కూతురు వివరాలు తెలుసా? అనడిగాను.

“ ఫిబ్రవరి 14న పెళ్లి అన్నంత వరకే తెలుసు. మిగిలిన వివరాలు నేనడగలేదు. ”

వాడు చెప్పటం పూర్తికాలేదు.

“ వ్వావ్.. వాలెంటైన్సు డే రోజునన్నమాట...

మొత్తానికి మన వాడు అనుకున్నట్టుగా ప్రేమకి పట్టాభిషేకం చేస్తున్నాడు .. శభాష్...” అన్నాను గట్టిగా.

“ సరే గానీ... మనం వాడి రూమ్మేట్లం కదా.. .కార్డు ఎందుకు పంపలేదంటావ్..” సందేహంగా అడిగాడు సుబ్బు.

“ వాడి స్నేహితులం మనం. కార్డు రాలేదని ఆగిపోతామా? ఒక రోజు ముందెళ్లి అక్కడ వాలిపోదాం.. మిగిలిన ఫ్రెండ్సుకి కూడా ఎస్ ఎమ్ ఎస్ పెట్టు” సలహా ఇచ్చాను.

అంతే.. 13వ తారీఖు ఉదయానికల్లా ఐదుగురు స్నేహితులం ఏకదంతం ఇంటి గుమ్మంలో ఉన్నాం.

ఆశ్చర్యకరంగా..ఇంత మంది కాలేజి స్నేహితులు వచ్చారన్న సంతోషం వాడి మొహంలో ఏ కోశానా కనిపించలేదు.

“ నేను పిలవకుండా మీరెలా వచ్చారు?”అన్నట్లుగా చూశాడు.

మొహం గంటుపెట్టుకుని కూర్చున్నాడు.

బలవంతంగా తప్పదన్నట్టు ఒకటి రెండు మాటలు మాట్లాడి ఎప్పుడు అక్కడి నుంచి తప్పుకుంటామా అని ఎదురుచూశాడు. అందంగా తీర్చిదిద్దిన నాలుగు అంతస్థుల భవనం.. మందీ మార్బలం, ఇంటి నిండా నౌకర్లు, ఇంటి ముందు బారులు తీరిన కార్లు... ఇలా పురమాయిస్తే చాలు పనివాళ్లు అన్ని పనులు చక్కపెడుతున్నారు.

అంతస్థులపరంగా వాడికీ, మాకూ చాలా అంతరం ఉందన్న విషయం అప్పుడే గ్రహించాం.

అవుట్ హౌస్లో కొన్ని గదులు అతిథులకు కేటాయించారు. అందులో ఓ చివర గదిలో మేం సర్దుకున్నాం.

“ ఒరే తిరిగి వెళ్లిపోదాం... మనం ఏదో అనుకుని సొంత డబ్బు ఖర్చుపెట్టుకుని మరీ ఇంత దూరం వచ్చాం. ఇక్కడ మనల్ని అందరు పురుగుల్ని చూసినట్టు చూస్తున్నారు. అంతా పచ్చనోట్ల మీద నడుస్తున్నారు. ”... సుబ్బు కోపంగా అన్నాడు.“ ఊరుకోరా.. ఆవేశపడకు.. సంభాళించుకో... రేపు ఉదయం పెళ్లికాగానే వెళ్లిపోదాం” నచ్చచెప్పబోయాను.

పళ్లు పట పట కొరుకుతూ అన్నాడు పక్కనున్న మరో స్నేహితుడు. “ వాడికెంత పొగరో చూశావురా... మనతో కాసేపు గడపలేదు. కనీసం వాళ్ల అమ్మనాన్నలకు మనల్ని పరిచయ      చేయలేదు. పనివాళ్లని పిలిచి అంతా వాళ్లనే చూసుకోమన్నాడు. మంచినీళ్లు కూడా వాళ్లే తెచ్చిచ్చారు చూశావా ”... కోపంతో వాడి ముక్కుపుటాలు ఎగసిపడుతున్నాయి.

“ డబ్బున్న వాళ్లంతా అంతేరా బాబూ..” సుబ్బు .

“ నువ్వు గమనించావా? మీరెందుకు ఇక్కడికి తగలడ్డారు అన్నట్లు చూస్తున్నాడు వాడు...”

“ అవునవును... ”

ఇద్దరూ రాయటానికి వీల్లేని బాషలో ఏకదంతాన్ని బండబూతులు తిట్టుకున్నారు.

నేను ఏకదంతాన్ని సమర్ధించలేకపోతున్నాను.

అలాగని వాడిని తిడుతున్న మిగిలిన స్నేహితులతో శ్రుతి కలపలేకపోతున్నాను.

“ వేచి చూద్దాం..” అన్న ధోరణితో ఉండిపోయాను. ఆ రాత్రి మిగిలిన వాళ్లంతో గదిలోనే ఉండి పేకాటలో మునిగిపోతే...నేను

మాత్రం మండపం డెకొరేషన్ పర్యవేక్షించే పనిలో నిమగ్నమయ్యాను.అదీ నాకు నేను కల్పించుకున్నదే.పెళ్లి కొడుకు గదికి అతి సమీపాన వేదిక ఉంది. దాని పక్కనే నిలబడ్డాను. పనివాళ్లు అలంకరణ పనులు చూస్తున్నారు.లోపల నుంచి మాటలు నా చెవిలో పడుతున్నాయి.అంతకు ముందు ఏం జరిగిందో తెలిదు గాని.. సంభాషణను బట్టి తేలిగ్గా అర్థం చేసుకోగలిగాను.''కాలేజీలో ప్రేమ వివాహాలు చేసేవాడినని... నేనూ అదే దారిలో వెళతానని ఎందుకనుకున్నావ్? బాబాయ్...''అది ఏకదంతం స్వరం. నేను చాలా తేలిగ్గా గుర్తుపట్టగలను.'' అదేంట్రా.. అంత తేలిగ్గా మాట్లాడతావు'' .అవతల పెద్దాయన ఏదో చెప్పబోతున్నాడు. ఏకదంతం ఆయనను మాట్లాడనివ్వటం లేదు. '' నేనేమయినా వెర్రిబాగులవాడినా? ప్రేమించి పెళ్లి చేసుకోటానికి...

కోట్లాది రూపాయల ఆస్తి, వారసత్వంగా వచ్చే బోలెడంత సంపద ఉన్నప్పుడు కూటికి ఠికాణా లేని ఏ పేద అమ్మాయినో ఎలా కట్టుకుంటాను పెద్దవాళ్లు ఇంట్లో నుంచి గెంటేస్తే జీవితాంతం కష్టాలను కొనితెచ్చుకోటానికి నేనేమయినా తెలివితక్కువ వాడినా...

డబ్బు డబ్బుని ఆకర్షిస్తుంది అన్న జీవితసత్యం మీకు తెలీదా...''

ఏకదంతం చెప్పుకుపోతున్నాడు. నా చెవులను నేనే నమ్మలేకపోయాను.

అత్తవారి తరపున వచ్చే వందల కోట్ల ఆస్తితో తండ్రికి దీటుగా... తనెలా పారిశ్రామిక సామ్రాజ్యాన్ని విస్తరించదలచాడో అతను చెబుతుంటే నా కళ్లు గిర్రున తిరిగిపోయాయి.

''అందాన్ని కొరుక్కుతింటామా? ఆస్తిపాస్తులుంటే కొండ మీద కోతినయినా అందంగా అలంకరించచ్చు...'' అన్నాడు మధ్యలో. అంటే... బహుశా పెళ్లి కూతురు అంత అందమైనది కాదేమో.. డబ్బు కోసమే ఆమెను కట్టుకున్నాడేమో అని కూడా అనుకున్నాను.

ఆ తర్వాత మాటలు నేను వినదలుచుకోలేదు.

అప్పటికప్పుడు స్నేహితులను బలవంతంగా బయలుదేరతీయించి ..

పెళ్లికి రెండు గంటల ముందే ఆ ప్రాంగణం నుంచి బయటపడ్డాం...

ఏళ్లుగడిచినా ...

ఆ సంఘటన నా జ్ఞాపకల నుంచి తుడిచిపెట్టుకుపోలేదు.

ప్రేమ గొప్పతనం గురించి ఎవరయినా మాట్లాడుతుంటే

నాకు లవ్ గురు..

ఏకదంతం గుర్తుకొస్తాడు.

నిలువెల్లా     ముసుగేసుకున్న స్వార్థపరుడు కళ్లముందు కదలాడతాడు.

రక్తం సలసల కాగిపోతుంది.

కడుపులోంచి అసహ్యం తన్నుకొస్తుంది.




అప్పుడే పొద్దున్న పనంతా పూర్తి చేసుకుని, టీవీ చూద్దామా, పుస్తకం చదువుదామా లేకపోతే వదినకి ఫోన్ చేద్దామా అనుకుంటున్నాను. అవిడ అసలు వదిన కాకపోయినా నాకు వరసకు వదిన. రాకపోకలు బాగానే వున్నాయి. స్నేహం కూడా బంధుత్వం కంటే ఎక్కువే. అందుకే రోజూ కాసేపైనా మాట్లాడుకోపోతే మాఇద్దరికీ తోచదు. ఇంతలో చెప్పా పెట్టకుండా వదినే వచ్చేసింది మా ఇంటికి. తలుపు తీయగానే వదిన్ని చూసి ఆశ్చర్యపోయాను.

"ఏమైంది వదినా..అంతా బానే ఉన్నారు కదా.." అనడిగాను ఆదుర్దాగా.

"ఆ అంతా బానే వున్నారు కానీ..ఇదిగో.. ఇదేంటో చూడూ.. నాకర్థం కాక ఫోన్ లో అడిగితే సరిగ్గా తెలీదని, మీ అన్నయ్య ఆఫీసుకెళ్ళగానే నేనే వచ్చేసా.." అంటూ తను కొత్తగా కొనుక్కున్న స్మార్ట్ ఫోను నా చేతిలో పెట్టింది.

"దేని గురించి?" అనడిగాను దాన్ని తీసుకుంటూ. నాకు తెలుసు.. మా వదిన చాలా చురుకైంది. ఇలా అందిస్తే అలా అల్లుకు పోతుంది. కొత్తగా వస్తున్న టెక్నాలజీని మా వదిన వాడుకున్నంతగా ఎవరూ వాడుకోరేమో. అందుకే అన్నయ్య ఈ మధ్యనే వదినకి స్మార్ట్ ఫోన్ ఒకటి బహుమతిగా కూడా ఇచ్చాడు. అది వచ్చినప్పట్నించి వదిన అందులో వున్న ఫీచర్స్ అన్నీ ఆకళింపు చేసేసుకుని, కొత్త కొత్త వన్నీ డౌన్ లోడ్ చేసేసుకుంటూ, దాని వాడకంలోనాకు గురువై పోయింది. అలాగ అన్నీ తెలిసున్న వదిన స్మార్ట్ ఫోన్ పుచ్చుకుని నా దగ్గరికి వచ్చిందంటే నాకే ఆశ్చర్యమనిపించింది.

“ఏవిటిది స్వర్ణా..నిన్న రాత్రనగా యాడ్ ఇస్తే ఇప్పటి దాకా ఒక్కళ్ళూ కాంటాక్ట్ చెయ్యలేదూ.. “అనడిగింది.

వదిన్ని మధ్యలోనే ఆపి, స్థిమితంగా కూర్చోబెట్టి, కాఫీ ఇచ్చి.. “దేని గురించి వదినా..”అనడిగాను.

“అదే..నిన్న నువ్వు చెప్పేవు కదా.. మొబైల్ లోయాడ్ ఇస్తే మనింట్లో వున్న పాత సామానంతా యాంటిక్ లాగా ఇట్టే అమ్ముడు పోతుందనీ. అందుకే నిన్న మీ అన్నయ్య ఆఫిసుకి వెళ్ళగానే ఆ ఆప్ డౌన్ లోడ్ చెసుకుని నేను కూడా ఒకటి అమ్మకానికి పెట్టేను..”

“ఏదమ్ముదామనుకున్నావూ?”

“అదే మా ఇంట్లో ఎప్పటిదో నరసరావుపేట పడక్కుర్చీ ఒకటుంది కదా.. మీ అన్నయ్య దాన్నొదల్రు.. ఎప్పుడో వాళ్ల తాతగారు, నాన్న గారు అందులోనె కూర్చునే వాళ్ళుట, అందుకని ఈయనా అందులోనే కూర్చుంటానంటారు..అదా.. విక్రమార్కుడి సింహాసనమంత ఉంటుంది.. డ్రాయింగ్, డైనింగ్ కలిసున్న మా ముందు హాల్లో సగానికి పైగా చోటు అదే ఆక్రమించేసింది. కొత్త ఫ్లాటు, కొత్త ఫర్నిచరూ..అన్నీ కొత్తగా వున్న ఆ హాల్లో అదొక్కటీ అసహ్యంగా మాసి పోయి కనిపిస్తోంది. బెడ్ రూమ్స్ లో మంచాలు తప్ప మరేవీ పట్టవు కదా.. ఉత్తినేనైనా ఎవరికైనా ఇచ్చెయ్యండి అంటే ఈయన వినరాయె.. అప్పుడెప్పుడో నువ్వు చెప్పేవు కూడా కదా..పాత వస్తువులని యాంటి క్లంటూ కొనే వాళ్ళుంటారని. అందుకే ఈ మొబైల్ లో ఆ ఆప్ డౌన్ లోడ్ చేసుకుని, ఆ పడక్కుర్చీ ఫొటో తీసిపెట్టి, దాని మీద ఎంతెంత గొప్ప వాళ్ళు కూర్చున్నారో రాసేను. మీ అన్నయ్యకి తెలిస్తే ఊరుకోరని తనకి చెప్పకుండానే యాడ్ అప్ లోడ్ చేసేను. ఇప్పటికొచ్చి ఒక్కళ్ళు కాంటాక్ట్ చెయ్యలేదు..” గుక్క తిప్పుకోకుండా చెప్పిన వదిన ఆయాసం తీర్చుకుందుకు ఓ నిమిషం ఆగింది.

నేను వదిన మొబైల్ అందుకుని ఆ యాడ్ చూసి ఉలిక్కిపడ్డాను. తెలుగులోకి మారిస్తే దాని అర్ధం ఇలా ఉంది. “ఆలసించిన ఆశా భంగం. ఎంతో పేరు ప్రతిష్ఠలున్న వంశం వారిది. ఇప్పుడు పాతగా అయినా విలువ ఏ మాత్రం తగ్గదు. నేను ఇంత రేటు అనుకుంటున్నాను. మీకు ఎంతకు కావాలో చెప్పండి..”అని రాసి, దాని కింద అన్నయ్య ఫొటోవుంది. కెవ్వుమన్నాను.

“ఏంటి..ఏమయింది?” వదిన ఖంగారు పడింది.

“నువ్వు అన్నయ్యని అమ్మకానికి పెట్టేసేవ్..”

“ఛ..ఛ..నేను మీ అన్నయ్యని అమ్మకానికి పెట్టడవేవిటి? ఏదీ.. “అని చూసి, వెఱ్ఱి మొహం వేసింది.

“లేదు స్వర్ణా, నేను మీ అన్నయ్య వంశం గొప్పతనం చెప్పడానికి ఆయన ఫొటో పెట్టి, కింద పడక్కుర్చీ ఫొటో కూడా పెట్టేను..ఆ పడక్కుర్చీ అప్ లోడ్ అవ లేదేమో..”

నాకు కోపం, నవ్వూ కలగలిసి వచ్చేసాయి. సందు దొరికింది కదా అని వదిన్ని ఆటపట్టించడం మొదలు పెట్టాను. “ఏవమ్మా సత్యభామా..మా అన్నయ్యని అంత దాసాను దాసుడుగా చేసేసుకోవాలనా ఏకంగా అమ్మకానికే పెట్టేసావ్..మా అన్నని కొనగలవారున్నారనే ఈప్రపంచంలో..” అంటూ గర్వంగా మొహం పెట్టాను.

వదినేవన్నా తెలివి తక్కువదా యేవిటీ..జరిగినది తెలుసుకుని, “నిర్మలా..అసలు విషయం ఇప్పుడు తెలిసింది.” అంది. ఏవిటన్నట్టు ముందుకు వంగాను.

“ఈ ప్రపంచంలో మీ అన్న లాంటి వారిని కొనుక్కునేంత తెలివి తక్కువదాన్ని నేనొక్కదాన్నేనన్నమాట.” అంది.

ఏం మాట్లాడను?




చాలా మంది లాగే...అమ్మానాన్నల కలలు తీరేలా ఇంజనీర్ లో డిగ్రీ సాధించాను. వెంటనే ఓ యూ ఎస్ కంపెనీలో జాబ్ వచ్చింది. రంగురంగుల జీవితాన్ని ఊహించుకుంటూ కొత్తరెక్కలు కట్టుకుని యూ ఎస్ గడ్డపై వాలిపోయాను. మంచి ఉద్యోగం, డాలర్లలో జీతం, సంతృప్తిగా జీవితం, ఓ మనిషి ఆనందంగా ఉండడానికి ఇంతకన్నా ఏం కావాలి? వృత్తిలోనూ ఆశించిన ఎదుగుదల. ఓ అయిదేళ్ళు ఇక్కడ కష్టపడితే చాలు, సొమ్ము మూటగట్టుకుని ఇండియాకు వెళ్ళిపోవచ్చు. ఆ తర్వాత దర్జాగా కాలిపై కాలేసుకుని బతికేయొచ్చు అనుకున్నాను.

నాన్న గవర్నమెంటు ఉద్యోగి. రిటైర్ అయ్యాక ఆయన సాధించినదల్లా ఓ సింగిల్ బెడ్ రూం ఫ్లాట్. నాన్న జీవితాన్ని బాగా చూసినందు వల్లనో చిన్నప్పట్నుంచి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నందుకో...నాన్న కన్నా బాగా బతకాలనిపించింది. ఎక్కువ డబ్బు, మంచి ఇల్లు, దేనికీ వెదుక్కోనక్కర్లేకుండా జీవించాలని కలలు కన్నాను. వాటిని నిజం చేసుకోవడానికి కష్టించడం ప్రారంభించాను. మొదట్లో బాగానే ఉన్నా రాన్రానూ ఇంటిబెంగ పట్టుకుంది. వారానికి కనీసం రెండుసార్లయినా అమ్మానాన్నతో మాట్లాడేవాడ్ని. ( అఫ్ కోర్స్.....చవగ్గా దొరికే అంతర్జాతీయ ఫోన్ కార్డుల్ని వాడే వాడ్ననుకోండి...) పిజ్జాలు, బర్గర్లు తింటూ రెండేళ్ళు గడిపేసాను. ఈ మధ్య కాలంలో ఎప్పుడు రూపాయి విలువ తగ్గుముఖం పట్టినా తెగ సంతోషించేవాడ్ని.

సంపాదన బాగానే ఉంది కానీ ఒంటికొమ్ములా ఎంతకాలమని బతుకుతాం..? అందుకే పెళ్ళి చేసుకోవాలని డిసైడైపోయా. అమ్మానాన్నలకు ఫోన్ చేసినపుడు ఈ విషయం ప్రస్తావించాను. వాళ్ళూ చాలా ఆనందించారు. అయితే ఓ పదిరోజులు సెలవుపై ఇండియా వస్తున్నాను. అమ్మాయిని చూడ్డం, పెళ్ళి, అంతా జరిగిపోవాలని ప్రకటించా, చవగ్గా దొరికిన టికెట్ బుక్ చేసుకున్నా. ఇంటికెళ్ళాలని అనుకున్నప్పట్నుంచి మనసు దూది పింజలా హాయిగా ఎగురుతోంది. బంధువులు, స్నేహితులు అందరినీ గుర్తు చేసుకుని వారి వారి అభిరుచులకు సరిపడా కానుకలు షాపింగ్ చేశా. ఏ ఒక్కరినీ మర్చిపోయినా కొంప కొల్లేరేగా. అందుకే జాగ్రత్తగా ప్లాన్ చేశా. ఇండియాలో ఓ వారం ఇట్టే గడచిపోయింది. అమ్మాయిల ఫోటోల దొంతరలు ఓపిగ్గా చూడ్డంలోనే పుణ్యకాలం కాస్త అయిపోయేలా ఉంది. యూ ఎస్ కు వెళ్ళే టైం దగ్గరయ్యే కొద్దీ కంగారు మొదలయ్యింది. ఏదో ఓ సంబంధం ఖరారు చేయక తప్పని పరిస్థితి. ఉన్న ఫోటోల్లో మనసుకు నచ్చిన దాన్ని ఫైన చేసాను.

నా హడావుడి సరే, అమ్మాయి తల్లిదండ్రులు కూడా రెండ్రోజుల్లో పెళ్ళి చేసేస్తామనడంతో ఆశ్చర్యపడడం నా వంతైంది. బహుశ కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదంటే ఇదే కామోసు. పెళ్ళి పేరుతో ఉష నా జీవితంలోకొచ్చేసింది. పసుపు పారాణి ఆరిందోలేదో అలా ఫ్లైట్ ఎక్కి యూ ఎస్ కు వెళ్ళాం. వెళ్ళెముందు ఇంటి చుట్టుపక్కల వారితో మాట్లాడి అమ్మానాన్నలని జాగ్రత్తగా చూసుకోవాల్సిందిగా కోరాను. అమ్మానాన్న వద్దంటున్నా వినకుండా చేతిలో నోట్లుంచి కదిలా.

ఉషకు యూ ఎస్ తెగ నచ్చేసింది. ఆమె ఉక్కిరిబిక్కిరి అయ్యేలా కొత్త ప్రదేశాలన్నీ చూపించేశా. ఏంటో జీవితం మళ్ళీ పాతబడులోంది. అయినా కొత్త ఎంతసేపుంటుంది? ఇవాళ రేపటికి పాతేగా.... క్రమంగా ఉషకు ఇంటి బెంగ పట్టుకుంది. మొదట్లో వారానికి రెండు సార్లయితే ఇప్పుడు మూడు నాలుగు సార్లు ఇంటికి ఫోన్ చేస్తోంది. పాపం అమ్మానాన్నలకు దూరంగా ఉంటోంది కదా, బాగా అలవాటు పడ్డాక నాకే విసుగనిపిస్తుంటే తనకు ఇంకా కష్టమేగ...అందుకే ఖర్చయినా ఓర్చుకోవడం అలవాటు చేసుకున్నాను. మరో రెండేళ్ళు కళ్ళ ముందు నుంచి కదలిపోయాయి. ఇంట్లో ఇద్దరు కొత్త సభ్యులు చేరారు. పాప, బాబు, వారితోటే లోకంగా బతికేస్తున్నాం. ఆఫీసులో ఏ మాత్రం వెసులుబాటు దొరికినా ఇంటికి వచ్చేస్తున్నాను...ఉష కూడా పిల్లల పెంపకంలో బిజీ అయిపోతోంది. ఎంత బిజీగా ఉంటున్నా అమ్మా నాన్నలకు ఫోన్ చేయడం మాత్రం వదల్లేదు. ఫోన్ చేసిన ప్రతీసారీ వాళ్ళు మనవల్ని పిలుచుకు రమ్మని ప్రాధేయపడేవారు. ఆ చిన్నారుల్ని చూడాలన్న వారి తపన నాకు అర్థమయ్యేది కానీ, ఇండియాకు వెళ్ళడానికి వీలుపడేది కాదు. కుటుంబం పెద్దదయింది. ఖర్చులూ పెరుగుతున్నాయ్. జీతం పెంచుకునేందుకు ఎక్కువ శ్రమ పడాల్సొస్తుంది. ఇండియాకు నన్ను వెళ్ళకుండా సంకెళ్ళు వేస్తున్నవి ఈ బాధ్యతలే... కాలం తన పని తాను చేసుకుపోతోంది. ఏళ్ళు అలా గడిచిపోతున్నాయ్.

ఉన్నట్టుండి ఓ రోజు నాన్నకు చాలా సీరియస్ గా ఉందని ఫోన్ వచ్చింది. ఒక్కసారి కలవరపాటు...అమ్మ పోయి ఏడాది కాలేదు. అప్పుడే నాన్నకిలా ......మనసేదో కీడు శంకిస్తోంది. అమ్మ ఉన్న రోజులలో నాన్న ' ఒరేయ్....మీ అమ్మతో నాకు ఎప్పుడూ తగాదే కానీ ఆమె లేకపోతే ఉండలేనురా...జంట పక్షుల్లో ఒకటి పోతే రెండవదానికి బతుకు నరకమే......' అంటుండేవాడు. అయితే ఆయన భయాన్ని నిజం చేస్తూ అమ్మ వెళ్ళిపోయింది. ఆ రోజు నాన్న ఫోన్ చేసినపుడు ఆయన గొంతులో ధ్వనించిన బాధ నా గుండెను పిండేసింది. చాలా బేలగా మాట్లాడాడు. ' చిన్నా మీ అమ్మ వెళ్ళిపోయిందిరా చివరి నిమిషం దాకా నిన్నే

కలవరించింది....ఎలాగైనా వచ్చి చివరి తంతు ముగించ.....' వాక్యం ముగియలేదు. చిన్న పిల్లాడిలా ఏడుస్తున్న చప్పుడు... నాకు ఆక్షణం ఏం చేయాలో తోచలేదు. ఇండియాకు సకాలంలో చేరుకోవడానికి సర్వశక్తులొడ్డాను. కానీ అమ్మ చివరిచూపు నాకు దక్కలేదు. ఒంటరిగానే వెళ్ళా.. పదిరోజులు కార్యక్రమాలు ముగిశాక నాన్నను మాతో వచ్చేయమన్నాను. తను నిర్జీవంగా నవ్వారు. కోడలు, మనవళ్ళు రాలేదేంటని మాటమాత్రంగా కూడా అడగలేదు. అమ్మతోటే అన్నీ ముగిశాయనుకున్నాడో ఏమో. ఆ తర్వాత నాన్న నుంచి ఫోన్లు రావడం తగ్గిపోయాయి. మేమే గుర్తుంచుకుని పదిహేనురోజులకొకసారి మాట్లాడేవాళ్ళం. ఆ సంభాషణల్లోనూ ఏదో వైరాగ్యం ధ్వనించేది. ఒక వ్యక్తి పోతే జీవితం ఇంత ఖాళీ అయిపోతుందా...? వారి నిష్క్రమణ మనపై ఇంత ప్రభావం చూపుతుందా?? ఆ ప్రశ్నలకు నాకు జవాబు దొరకలేదు అనడం కన్నా అంతగా ఆలోచించే సమయం దొరకలేదనడమే సబబు. చూస్తుండగానే నెలలు గిర్రున తిరిగిపోయాయ్. ఇదిగో ఇప్పుడు నాన్నకు బాగా లేదని కబురు. ఇప్పుడూ అంతే.. సెలవు దొరుకుతుందో లేదోనని భయం.

నా దురదృష్టం.. రెండ్రోజులయ్యాక మరో మెస్సేజ్. నాన్న పోయారని. కోలుకోలేని షాక్. అలా వుండిపోయాను. ఆ క్షణం తెలిని నిర్వేదం నన్ను ఆవరించింది. సమయానికి ఎవరూ లేకపోవడంతో కాలనీ సొసైటీ వారే అంత్యక్రియలు చేశారు. అమ్మను నాన్న సాగనంపాడన్న తృప్తయినా ఉండేది. కానీ, నాన్న.....నేనున్నా దిక్కూ మొక్కూ లేని అనాధగా..ఈసారి చాలా డిప్రెస్ అయ్యాను. అమ్మానాన్న మనవల్ని చూడకుండానే కన్నుమూశారు.

జీవితం ఎంత దుర్మార్గం....అయినవాళ్ళు దూరమైతే కనీసం వారిని తలుచుకుని దు;ఖించే పాటి టైం కూడా ఇవ్వడం లేదు. మళ్ళీ పరుగు మొదలు. ఇదివరకటి ఊపు లేకపోయినా అడుగులు ముందుకు పడుతూనే ఉన్నాయి. రెండేళ్ళు గడవగానే యూ ఎస్ లో ఉండడం ఇక అసాధ్యం అనిపించింది. అందుకే ఉషకు, పిల్లలిద్దరికీ ఏమాత్రం ఇష్టం లేకున్నా ఇండియా వెళ్ళడానికి మూటా ముల్లే సర్దుకున్నా.. ఇండియాకు వచ్చాక ఓ డబుల్ బెడ్ రూం ఇంటికోసం వేట ప్రారంభించాను. ఇండ్ల ధరలు బాగానే పెరిగిపోయాయి. నేను కూడబెట్టుకున్న డబ్బులో డబుల్ బెడ్ రూం ఇల్లు దొరకడం కష్టమనిపించింది.చిన్నపాటి ఇంటికోసం రాజీ పడాలనిపించలేదు. పోనీ బ్యాంక్ లోన్ తీద్దామంటే అప్పుచేసి ఇల్లు కొనడానికా ఇన్నాళ్ళు అమెరికాలో కొలువు వెలగబెట్టిందని మనసు వెటకారం చేసింది. ఎలాగైనా సరే, పైసా అప్పు లేకుండా ఇల్లు కొనాలని గట్టిగా నిర్ణయించుకున్నా. మళ్ళీ యూ ఎస్ కు వెళ్ళడమే సరైన మార్గం అనిపించింది. ఉషతో ప్రస్తావిస్తే రానని ఖరాఖండీగా చెప్పేసింది. ఓ రెండంటే రెండేళ్ళే వర్క్ చేసి మళ్ళీ వచ్చేస్తానని ఉషతో బతిమాలాను. ఆమె మౌనంగా ఉండిపోయింది.

అదే అంగీకారమనుకున్నా. మరి నా అవసరం అలాంటిది. పిల్లలు మాత్రం ఎగిరి గంతేశారు. వారిద్దరినీ వెంటబెట్టుకుని మళ్ళీ ఫ్లైటెక్కాను. పట్టువదలని విక్రమార్కుడిలా. అదే పరుగు....అలసటను పట్టించుకోని జీవితం కొత్త లక్ష్యాలను శాసిస్తున్న ఆశ. రెండేళ్ళనుకున్నా...మరో అయిదేళ్ళు ఇట్టే గడచిపోయాయి. పిల్లలు బాగా ఎదిగారు. పాప ఓ అమెరికన్ ను పెళ్ళి చేసుకుంది. అబ్బాయి అమెరికా జీవితాన్ని తలమునకలుగా ఆస్వాదిస్తున్నాడు. కొద్దికాలం తర్వాత ఇండియాకు వెళ్ళిపోదామని అనుకున్నా.. డబుల్ బెడ్ రూం ఇల్లు ఒనడానికి సరిపడా డబ్బులున్నాయి. ఓ మంచి ప్రాంతంలో కొనాలి. హ్యాప్పీగా ఉండాలి అని మనసారా అనుకున్నా.

ఇప్పుడు నేను అరవయ్యో పడిలో ఉన్నాను. పరుగులు తీసి తీసి అలసిపోయిన వయసు, మనసు నాది. రోజులో ఎక్కువ సమయం ఇంట్లోనే గడుపుతుంటాను. సాయంత్రం వేళ కాలనీలోని గుడికి మాత్రం వెళుతుంటాను. కష్టమో నిష్టురమో, ఇష్టమో అనిష్టమో తప్పనిసరిగా నా వెన్నంటి ఉన్న ఉష కూడా వెళ్ళిపోయింది. పిల్లలు అప్పుడప్పుడూ అకేషనల్ గ్రీటింగ్ కార్డులు పంపడానికే పరిమితమయ్యారు. ఇప్పుడు నేను ఒంటరిని. భౌతికంగానూ..మానసికంగానూ.

ఒక్కోసారి ఆలోచిస్తుంటే నా జీవితం నాకే విచిత్రమనిపిస్తుంది. వెనుదిరిగి చూసుకుంటే పరుగులు తీస్తున్న నా అడుగుల చప్పుడు..ఆయాసంతో రొప్పుతున్న నా మనసు... ఇంతే... ఇంతకంటే ఇంకేం కనిపించడం లేదు. ఎందుకో నాన్న గుర్తొచ్చాడు. అవునూ నాన్న ఇండియాలోనే ఉన్నాడు...సొంత ఇంటిలోనే జీవితాన్ని అనుభవించాడు. మరి నేనెందుకిలా...కేవలం ఒక అదనపు గది ఉన్న ఇంటికోసం మనసులో అన్ని బంధనాల గదుల్నీ కూల్చేసుకున్నాను. పెదాలపై నిస్సహాయత. జాలితో కూడిన సన్నటి నవ్వొకటి కదలాడింది. రవ్వంత సుఖం కోసం ఇంత దు;ఖాన్ని ఆహ్వానించాలా? ఇప్పుడు నేను చనిపోతే నా చుట్టుపక్కల వాళ్ళే అంతిమ సంస్కారాలు చేస్తారేమో ..నాన్నకు చేసినట్టు..

...ఇంత అవసరమా...? ఈ ఆలోచన సముద్ర మథనం నుంచి చివరగా ఈ ప్రశ్న ఒకటే నా మనసులో తేలింది. సమాధానం కోసం అన్వేషిస్తూనే ఉన్నాను. ఒక్కటైతే నిజం....జీవితం కేవలం పరుగు పందెం కాదు...ఆలోచించడానికి..ఆస్వాదించడానికి అర్థం చేసుకోవడానికి కాసింత సమయం కేటాయించాలి. మళ్ళీ ఈ దారిలో వస్తామో లేదో....ఒకే జీవితం.. జీవంతంగా జీవించాలి....జన్మ జన్మాంతాల దాకా గుబాళించే అనుభూతుల ఇంగువను ఇక్కడే గుడ్డకట్టడం ప్రారంభించాలి.....!




రైలు వేగంగా కదులుతోంది కానీ ఇంకాస్త వేగంగా వెళితే బాగుండు అని అనుకుంటున్నాడు రాఘవయ్య. ఎందుకంటే తన కుమార్తె శరణ్య పెళ్ళి ముహూర్తం దగ్గర పడుతోంది. యాదగిరి గుట్ట మీద లక్ష్మీనరసిమ్హస్వామి సన్నిధిలో పెళ్ళి ముహూర్తం ఉదయం 11;45 ని.లకు. భువనగిరికి రైలు చేరుకోవడానికి ఇంకా గంట సమయం పడుతుంది. అక్కడి నుండి మరో గంట ప్రయాణం. ఇప్పుడు సమయం ఉదయం 8;45 అయింది. పెళ్ళివారికి ఇవ్వాల్సిన కట్నం డబ్బులు లక్షానలబై వేలు సూట్ కేసులో ఉన్నాయి... ఎంత ప్రయత్నం చేసినా తీరా ఈ రోజుకు కాని సర్దుబాటు అవలేదు. అందుకే కూతురి పెళ్ళి ముహూర్తానికి సమయం దగ్గర పడే సమయానికి చేరుకోవాల్సి వస్తోంది...కానీ తప్పలేదు... ముహూర్తానికి ముందే కట్నం డబ్బులు ముట్టజెప్పనిదే పెళ్ళి జరగదని కాబోయే వియ్యంకుడు ఖరాఖండీగా చెప్పేశాడు.

సూట్ కేసు పక్కనే పెట్టుకుని చేయివేసి కూర్చున్నాడు రాఘవయ్య.

ఇంతలోకి ఓ అపరిచిత వ్యక్తి తన సీటుకు ఎదురు సీట్లోకి వచ్చి కూర్చున్నాడు. అతడి వయసు పాతిక సంవత్సరాలుండొచ్చు. చేతిలో అచ్చు ఇలాంటిదే సూట్ కేసు ఉంది...

కాసేపటికి అతడే రాఘవయ్యను పరిచయం చేసుకుని మాటలు కలిపాడు..తన పేరు రాజేష్ అనీ, ఎమ్మెస్సీ ఫిజిక్స్ చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నానని చెప్పాడు.. ఆ పనిమీదే వరంగల్ వెళ్ళి వస్తున్నానని కూడా చెప్పాడు. కుర్రాడు బుద్ధిమంతుడిలా ఉన్నాడు అని మనసులోనే అనుకున్నాడు రాఘవయ్య. యాదగిరి గుట్ట దగ్గర్లోని ఒక పల్లెటూరు తన స్వగ్రామమని రాఘవయ్యతో చెప్పాడు రాజేష్. చాలా సేపట్నుంచి సీట్లో కూర్చున్న రాఘవయ్య కడుపు ఉగ్గబట్టినట్టు అవడంతో బాత్రూం కి వెళ్ళడానికి ఎలాగా అని సంశయిస్తూనే " బాబూ..కాస్త ఈ సూట్ కేసు చూస్తూంటావూ ..! ఇప్పుడే వస్తాను " అని అడిగాడు రాజేష్ ని... రాజేష్ నవ్వుతూ " అలాగే వెళ్ళి రండి అంకుల్..." అన్నాడు... రాఘవయ్య బాత్రూం కి త్వరగానే వెళ్ళి వచ్చాడు కానీ అపరిచిత వ్యక్తికి అప్పగించి వచ్చానే అని అతడి మనసు సూట్ కేసు మీదే ఉంది....వచ్చి కూర్చుంటూనే అతడి కళ్ళల్లోని ఉద్దేశాన్ని పసిగట్టినట్టినట్టు రాజేష్ నవ్వుతూ " అంకుల్ మీ సూట్ కేసు తెరిచి ఒక సారి చూసుకోండి ఎందుకైనా మంచిది.." అన్నాడు... తన ఉద్దేశాన్ని రాజేష్ పసిగట్టాడని అర్థమైంది రాఘవయ్యకి...." చ..చ..అదేం లేదు బాబూ...మనిషిని సాటి మనిషి నమ్మకపోతే ఎలా..? అయినా మంచి కుర్రాడిలాడిలా కనిపిస్తున్నావు...అమ్మాయి పెళ్ళికని తీసుకుపోతున్న డబ్బని మనసు విప్పి చెప్పుకున్నాను కూడా...చూస్తూ చూస్తూ ఒక ఆడపిల్ల జీవితాన్ని నాశనం చేసేంత చెడ్డవాడివని మాత్రం అనిపించడం లేదు..." అన్నాడు నిర్మలంగా....

" ఈరోజుల్లో కూడా ఇంత నిర్మలంగా ఉంటే ఎలా అంకుల్....అపరిచిత వ్యక్తినీ, కాబోయే అల్లుడ్నీ అంత స్వచ్ఛంగా నమ్మేస్తే ఎలా...నామాట విని సూట్ కేసు తెరిచి చూసుకోండి....." అన్నాడు స్థిరంగా.. అతడి మాటలు అర్థమయీ కానట్టనిపించి అప్రయత్నంగానే సూట్ కేసు తెరిచి చూసుకున్న రాఘవయ్య గుండె ఆగినంత పనయింది..." నా డబ్బు...నాడబ్బు..." అంటూ అరిచాడు.. " కంగారు పడకండి....ఇది చూడండి..." అంటూ అచ్చు అలాంటిదే తనదగ్గరున్న సూట్ కేసు తెరిచి చూపించాడు రాజేష్...అందులో తన డబ్బు......." అసలెవరీ అబ్బాయి...? దొంగా? కాదు...దొంగయితే తన వివరాలెందుకు చెప్తాడు? మరి సూట్ కేసులెందుకు తారుమారు చేసాడు...? మళ్ళీ ఎందుకు తన డబ్బు తనకు చూపించి తనను అయోమయానికి గురిచేస్తున్నాడు..?.....

" అన్నిటికీ సమాధానం చెప్తానంకుల్...ముందు మంచినీళ్ళు తాగండి...." రాఘవయ్య మనసులోని ఉద్దేశాన్ని గమనించినట్టుగా అన్నాడు రాజేష్......

అతడు చెప్పిన విషయాలు విన్న రాఘవయ్య నిర్ఘాంతపోయాడు......

**************************************

పెళ్ళివారు రాఘవయ్య కోసం ఎదురుచూస్తున్నారు.. గబగబా చేరుకున్నాడు రాఘవయ్య..నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుంటూ సూట్ కేస్ తన కొడుకు శేఖర్ చేతిలో పెట్టాడు రాఘవయ్య.

" ఏంటండీ..ఇంతాలస్యమైందీ? కాస్త తొందరగా రావొచ్చు కదా.... పెళ్ళివారు కట్నం డబ్బులిస్తేనే పెళ్ళిజరిగేది అని భీష్మించుక్కూర్చున్నారు...? " అంది రాఘవయ్య భార్య శ్యామలమ్మ..

శేఖర్ సూట్ కేసు తెరిచి చూసాడు..అందులో బట్టలు కనిపించాయి కానీ, డబ్బు లేదు.

" ఏంటి నాన్నా ఇందులో డబ్బులేవీ...."అనరిచాడు శేఖర్...

***************************

కట్నం డబ్బుల సూట్ కేసు పోయిందన్న వార్త క్షణంలో దావానలంలా వ్యాపించి మగపెళ్ళివారిదాకా చేరింది....

ఏమిటి రాఘవయ్యగారూ ఇదీ..? నేను విన్నది నిజమేనా..?" రాఘవయ్యను అడిగాడు కాబోయే వియ్యంకుడు ఆనందరావు..

" అవును బావగారూ...ఒక ఆగంతకుడు నాతోనే కలిసి ప్రయాణించాడు రైల్లో....అతడి దగ్గరా అచ్చు ఇలాంటి సూట్ కేసే ఉంది.. నా అనుమానం అక్కడే సూట్ కేసు మారిపోయి ఉంటుంది...." దిగాలుగా అన్నాడు రాఘవయ్య, తండ్రి పక్కనే నిలుచున్న్న పెళ్ళికొడుకు మొహంలోకి జాగ్రత్తగా గమనిస్తూ...

" నోనో..నేన్నమ్మను....ఇదంతా కటం డబ్బులు ఎగ్గొట్టడానికి మీరాడుతున్న నాటకం...." గట్టిగా అరిచాడు ఆనందరావు...

అలా అనకండి...ఒక్క ఆర్నెల్లు గడువివ్వండి.. మీ కట్నం డబ్బులు రెండు మూడు వాయిదాల్లో ఇచ్చేస్తాను..పెళ్ళి మాత్రం ఆపకండి.." దీనంగా అన్నాడు రాఘవయ్య..." నోర్మూయ్యండి..ఇక్కడ నేనేమన్నా ఈజీ ఇన్స్ టాల్మెంట్ స్కీం ఏమన్నా పెట్టానా?..... " అంటూ ఇంకేదో అనబోతుండగా మధ్యలో పెళ్ళికొడుకు కల్పించుకుని..." నాన్నా ఆర్నెల్లల్లో ఇచ్చేస్తామని అంటున్నారుగా...." అన్నాడు.

" బాబూ...!అంతా నువ్వనుకున్నట్టే జరుగుతోంది కదా...." పెళ్ళికొడుకు మొహంలోకి సూటిగా చూస్తూ అన్నాడు రాఘవయ్య....షాక్ కొట్టినట్టు చూసాడు పెళ్ళికొడుకు...

" నేననుకున్నట్టు జరగడమేమిటి....నోనో..నాకేం తెలీదు......" నీళ్ళు నమిలాడు.    ఆనందరావు ఆశ్చర్యపోయి, " ఏమిట్రా ఇదీ? నువ్వనుకున్నట్టు జరగడమేమిటి...?" అంటూ కొడుకునడిగాడు..." పాతికవేలు వాటా తీసుకుని నా ప్లాన్ సక్సెస్ చేస్తానని..మొత్తం చెప్పేసి ఇంత మోసం చేస్తాడా రాజేష్ వెధవ..." గొణుక్కుంటున్నట్టు అన్నాడు పెళ్ళికొడుకు...

" మోసం నాది కాదురా వెధవా...నీది....కాబోయే మామగారి డబ్బు కొట్టేసి మళ్ళీ ఆయన నుంచే కట్నం కొట్టెయ్యడానికి ప్లాన్ చేస్తావా..?" గదిలోంచి బయటికొచ్చాడు రాజేష్.

అతన్ని చూస్తూనే చల్లగా జారుకోను చూసాడు పెళ్ళికొడుకు...

ఈలోగా శేఖర్ అతన్ని ఒడిసి పట్టుకున్నాడు....

ఆశ్చర్యపోయి చూస్తున్న అందరితో రాజేష్ ఇలా వివరంగా చెప్పాడు...

" వీడూ నేనూ స్కూల్లో కలిసి చదువుకున్నాము...తర్వాత చాలారోజులకు మళ్ళీ కలిసాడు..పెళ్ళి కుదిరిందని చెప్పాడు...దురాశతో తను వేసిన ప్లాన్ చెప్పి, నాకూ వాటా ఇస్తానన్నాడు...ఎంగేజ్ మెంట్ లో బట్టలు కొన్నప్పుడు గిఫ్టుగా వచ్చిన ఒకే మోడల్ సూట్ కేసులు చక్కగా వర్కవుట్ అయ్యాయి..అప్పుడే వీడి ప్లాన్ కి నేను సహకరించనని చెప్పేస్తే వేరేవాళ్ళ ద్వారానైనా అనుకున్న పని చేసి తీరతాడని ఒప్పుకున్నట్టు నటించాను....ఒక ఆడపిల్ల జీవితం మోసగాడి చేతిలో పడకుండా గుట్టురట్టు

చేయగలిగాను...."

ఇవన్నీ విన్న తర్వాత అక్కడ క్షణమైనా ఉంటే అందరూ పట్టుకుని తన్నడం ఖాయం అని గుర్తించి కట్టుబట్టలతో మాయమయ్యారు పెళ్ళికొడుకుతో సహా ...

" డబ్బుకోసం వైవాహిక బంధాన్ని సైతం ఎరగా వాడుకోజూసిన ఆ దుర్మార్గుడి చేతిలో నా కూతురు ఇంకెన్ని పాట్లు పడేదో తల్చుకుంటేనే భయంగా ఉంది...."

బాధగా అన్నాడు రాఘవయ్య...

" నాన్నా...ఒక విషయం చెప్పనా...కనీసం పరిచయమైనా లేని ఒక ఆడపిల్ల జీవితం గురించి ఇంత మానవీయ కోణంలోంచి ఆలోచించాడంటే....కుల గోత్రాల కన్నా ముఖ్యమైన అతడి గుణమెంత గొప్పదో చూడండి... అతడి చేతిలో మన శరణ్య జీవితం ఆనందంగా ఉండగలదని నేననుకుంటున్నాను.." తండ్రితో అన్నాడు శేఖర్. రాజేష్, శరణ్యల పరస్పర అంగీకారంతో యాదగిరీశుని సన్నిధిలోనే వైభవంగా జరిగింది వారి పెళ్ళి.




సరోజిని దేవి, ప్రసాద్ రావు గారు చాల హడవిడిగా పనులు చేస్తున్నరు, ఆ ఇంటి పని మనిషి శాంతమ్మకి ఆమె కూతురు కల్పనకి అయితే క్షణం ఖాళీ లేదు. ఎల్లుండి వాళ్ళ అబ్బాయి కిరణ్ పెళ్ళి. కూతురు సుధ ఆమెరికా నుంచి వచ్చే టైము అయింది వాళ్ళ అనందానికి అంతే లేదు చాల రోజుల తర్వతా అమ్మాయి వస్తుంది పెళ్ళి కళతో ఇల్లంతా కళ కళలాడిపోతుంది. ప్రసాద్ రావు గారి తల్లి సరస్వతమ్మ ఎనభైల వయసు అయినా మనవడి పెళ్ళి ఉత్సాహంతో అన్ని పనులు పురమాయిస్తూ సందడి చేస్తోంది.

ప్రసాద్ రావు గారిది సంపన్న కుటుంబం, వాళ్ళకి చాలా వ్యాపారాలు ఉన్నాయి, తరతరాల నుంచి తరగని ఆస్థి. దేనికీ లోటు లేదు పిల్లలు కూడా బాగా చదువుకుని వృద్ధిలోకి వచ్చారు కూతురు సుధ ఆమెరికాలో డాక్టరు. పెళ్ళి అయ్యి ఇద్దరు పిల్లలు. ఇక ఆఖరి వాడు కిరణ్ అమెరికాలో చదువుకొని వచ్చి ఇక్కడ వాళ్ళ నాన్న గారి వ్యాపారాలు చుసుకుంటున్నాడు, ఇప్పుడు పెద్దలు ఆకాంక్షతో పెళ్ళి నిర్ణయించారు.

ఆ ఇంట్లో తరతరాలనించి రంగయ్య కుటుంబుం పని చేస్తుంది, అయన ఒక్కగానొక్క కూతురు శాంతమ్మ అమె కూతురు కల్పన. కల్పన చాల చురుకైన పిల్ల చాల అందంగా ఉంటుంది వయస్సు పంతొమ్మిది సంవత్సరాలు, శాంతమ్మ ఒప్పుకోకున్న ఆడపిల్లకి చదువు ఎందుకని అన్నా సరోజిని దేవి, సరస్వతమ్మ చదివిస్తున్నరు. వాళ్ళకి ఆ పిల్ల అంటే ప్రాణం. చాలా బాగా చుసుకుంటారు, చెప్తే తప్ప ఎవరూ ఆ ఇంట్లో పనివాళ్ళనుకోరు. వాళ్ళని చూస్తే అందరూ బంధువులు అనుకుంటారు. సుధ, వాళ్ళ ఆయన పిల్లలు వచ్చారు, తర్వత రెండు రోజులకి అందరి బంధువుల సమక్షం లో అత్యంత వైభవం గా కిరణ్ ఆకాంక్షల పెళ్ళి జరిగిపోయింది.

ఆకాంక్ష ఆ ఇంటికి వచ్చినప్పటినుంచి తనకి ఆ ఇంట్లో కల్పన కి ఇస్తున్న విలువ చూసి తట్టుకోలేకపోతుంది అన్నిటికీ కల్పన కల్పన అని సరస్వతమ్మ గారు, సరోజిని దేవి పిలవటం ఆ పిల్లతో చనువుగా ఉండటం తనకి అస్సలు నచట్లేదు. ఒకటి రెండు సార్లు కిరణ్ తో చెప్పి చూసింది కాని , అతను వాళ్ళు ఆ ఇంట్లో చాలా సంవత్సరాలనుంచి ఉన్నారు అని కొట్టి పారేసాడు. ఆకాంక్ష తమతో కల్పనని సమానంగా చూడటం తట్టుకోలేకపోతుంది.

ఒకరోజు ఆదివారం అందరు ఏదో పెళ్ళికని తయారయ్యారు. ఆకాంక్ష పట్టు చీర నగలతో మెరిసిపోయింది, తయ్యారు అవుతుంటె కల్పన గదిలోకి వచ్చింది కాఫీ తీసుకొని, పట్టు చీరలో ఉన్న కల్పన ని చుసి అశ్చర్య పోయింది , కోపంతో కల్పనని తిట్టింది, పనిపిల్లవి ఎవరూ లేకుండా చూసి పట్టుచీర దొంగతనంగా కట్టుకుంటావా అని మీద చెయ్యి ఎత్తింది , వెంటనే సరోజిని దేవి అడ్డుకోపోతే , పనిపిల్లకి అంత విలువేమిటి మనతో సమానంగా చుడటం ఎంటి ?అంటే వెంటనే ఆవిడ ఆకాంక్ష వైపు కోపంగా చూస్తూ తను పనిపిల్ల కాదు, మా ఇంటి జివనజ్యోతి అన్నారు. వెంటనే పదిహేను సంవత్సరాల క్రితం జరిగింది కళ్ళనీళ్ళతో చెప్పుకుంటూ వచ్చారు.

సరోజిని దేవి, ప్రసాద్ రావు గారికి కిరణ్ తర్వాత చాలా సంవత్సరాలకి ఒక అమ్మాయి పుట్టింది ఆఖరి సంతానం జ్యోతి అని పేరు పెట్టుకొని ముద్దుగా పెంచుకోసాగరు, జ్యోతి పుట్టాక ఆ కుటుంబానికి బాగా కలిసివచ్చింది. అదే సమయం లో శాంతమ్మ కి కల్పన పుట్టింది పాపం పుట్టుకతోనె ఆ అమ్మాయికి గుండెల్లొ లోపం , చూపు సరిగ్గా లేదు. శాంతమ్మ కల్పన ని తలచుకొని బాధ పడని రోజు లేదు, ప్రసాద్ రావు గారు ఎంత డబ్బు ఖర్చుపెట్టినా ఆ అమ్మాయికి పరిస్థితేం మెరుగవలేదు. జ్యోతికి నాలుగు సంవత్సరాలు ఉన్నప్పుడు ఒకసారి స్కూల్ లో పరిగెత్తుతు మెట్ల మీద నుండి పడి తలకి బలమైన దెబ్బ తగిలింది, వెంటనె ఆసుపత్రికి తీసుకుని వెళ్ళేసరికే ఆ అమ్మయి కొమాలోకి వెళ్ళిపోయింది. డాక్టర్లు పరీక్షించి ఇక లాభం లేదని చెప్పారు...అంత బాధలో కూడా ప్రసాద్ రావు గారికి ఒక అలోచన వచ్చింది తమ జ్యోతి వెళ్ళిపోతోందిది కనీసం తనని కల్పనలో చూసుకోవాలనుకొని వెంటనే డాక్టరుతో మట్లాడారు. శాంతమ్మని ఒప్పించి కల్పనని ఆసుపత్రికి తీసుకోని వచ్చారు అలా జ్యోతి కళ్ళు , గుండె కల్పనకి అమర్చారు. అప్పటి నుండి వాళ్ళు కల్పన కళ్ళలోనే జ్యోతిని చూసుకుంటున్నారు. అలా జ్యోతివాళ్ళ మధ్య లేకపోయినా కల్పన రూపంలో జివనజ్యోతి అయ్యింది.

సరోజిని దేవి గారు    ఆ విషయం చెప్పగానే అందరి కళ్ళు చెమర్చాయి, ఆకాన్షకి వాళ్ళ మంచితనం తెలిసివచ్చింది. కూతురు ఇంక లేదు ఎప్పటికీ రాదు అన్నంత బాధని భరిస్తూ ఇంకొకళ్ళకి సహాయం చేసిన వాళ్ళ గొప్ప మనసుకి    దణ్ణం పెట్టి క్షమాపణ కోరుకుంది.

కల్పన అశ్చర్యపోయింది ఇన్నిరోజులు వాళ్ళు తమకి బ్రతుకు తెరువు చూపిన వాళ్ళు అనుకుంది కాని- తనకి జీవితమే ఇచ్చారు అని తెలుసుకొని వెంటనే వచ్చి ఇద్దరి కాళ్ళకి దణ్ణం పెట్టింది , వెంటనే ప్రసాదు రావు గారు " అప్పుడే దణ్ణం పెట్టే స్తే ఎలా? ఇంకా మేము మా చిన్న కూతురు పెళ్ళి బాధ్యత పూర్తి చేయాలిగా " అన్నారు నవ్వుతూ...

అందరి కళ్ళల్లో ఆనందం వెల్లివిరిసింది.




ఉదయం పదకొండు గంటల సమయం. ఇంటర్వెల్ బెల్ ముగిసి పిల్లలంతా క్లాసులోకి తిరిగి వెళ్ళిపోవటంతో , అప్పటిదాకా రణగొణ ధ్వనిగా వున్న స్కూల్ ప్రాంగణమంతా నిశ్శబ్దం గా మారిపోయింది. థర్డ్ పీరియడ్ తనకి లిజరు కావడం తో స్టాఫ్ రూం లోకూర్చుని సెవెంత్ క్లాస్ పిల్లల సైన్సు క్లాస్వర్క్స్ కరెక్షను చేసుకుంటుంది పావని.తనతో పాటు అదే పీరియడ్ లో లిజరు వున్న మిగతా టీచర్సు కూడా ఎవరి వర్కు వాళ్ళు చేసుకుంటూనే సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. నిజానికి టీచర్సందరూ ఎంతో అశగా ఎదురుచూసేది రోజు మొత్తం మీద ఒకటో రెండో వచ్చే ఆ లిజర్స్ కోసమే. పొద్దస్తమానం చాలా మంది పిల్లలతో అరచి అరచి విసుగొచ్చినందువల్ల లిజరు పీరియడ్ లోనే కాస్త తీసుకుంటారు., వారంతా.

'ఏమిటి పావని! అంత సీరియస్ గా కరెక్షన్స్ చేస్తున్నావు?' నవ్వుతూ అడిగింది తెలుగు టీచర్ జ్యోతి. రేపు ఉదయమే పిల్లలకు క్లాస్వర్క్స్ ఇచ్చేయాలి జ్యోతి మేడం, యూనిట్ టెస్ట్ దగ్గర్లోనే వుందిగా!' తల ఎత్తకుండా చక చకా టిక్స్ కొడుతూనే అంది పావని. ఇంతలో అటెండరు సైదులు వచ్చాడు స్టాఫ్ రూం కి.

"...పావని మేడం, మిమ్మల్ని ప్రినిస్పాల్ సారు రమ్మంటున్నారు" కబురందించాడు సైదులు. ఒక్క కంగారనిపించింది పావనికి. ఈ టైం లో ఎందుకు పిలిచినట్టో ' అని మనసులో అనుకుంటూ పెన్ను అక్కడే పడేసి గబ గబా బయల్దేరింది. ' మే ఐ కమిన్ సార్ ' వినయం గా అదిగి ప్రినిస్పాల్ రూ లోకి అడుగుపెట్టింది పావని. ' ప్లీజ్ కం ' అని మర్యాదగా లోపలికి ఆహ్వానించారు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ శరత్ గారు. మళ్ళీ టెన్షన్ మొదలైంది పావనికి, ఎంతో అనవసరమైతే తప్ప లేడీ టీచర్స్ ని పర్సనల్ గా పిలవరు ఆయన, చాలా స్ట్రిక్ట్ మనిషి. కొంపదీసి పేరంట్స్ దగ్గర్నుంచి ఏమైనా కంప్లైంటా .. అనుకుంది.

"మిసెస్ పావని, కంగ్రాట్స్" అని ప్రిన్సిపాల్ అనగానే ఎంతో రిలీఫ్ కలిగింది. హమ్మయ్య అని తేలిగ్గా ఊపిరి తీసుకుని, ఆయన చెప్పబోయే విషయాన్ని ఆసక్తిగా వినేందుకు రెడీ అయ్యింది.

"మీరు ఈ సంవత్సరం ' ఉత్తమ ఉపాధ్యాయురాలిగా' ఎన్నికయ్యారు, టీచర్స్ డే నాడు మీకు అవార్డు ఇవ్వబడుతుంది., ఇందాకే నాకు మెయిన్ బ్రాంచి నుంచి ఫ్యాక్స్ అందింది" అని ప్రిన్సిపాల్ సార్ చెప్పగానే ఎంతో సంతోషం కలిగింది పావనికి. "థాంక్యూ వెరీమచ్ సార్ అని చిరునవ్వుతో ఆయనకు కృతజ్ఞతలు చెప్పి తిరిగి స్టాఫ్ రూం కి చేరుకుంది. ఆమె చెప్పిన విషయం విన్న స్నేహితులు, కొలీగ్స్ అందరూ ఆమెను మనస్పూర్తిగా అభినందించారు. ఆమెకు మాటల్లో చెప్పలేనంత ఆనందం గా వుంది. ఈ విషయం భర్తకు చెప్పాలని మొబైల్ ఫోన్ తీసింది. కానీ ఫోన్ చేయలేదు. పర్సనల్ గా చెప్పి భర్త నుంచి అభినందనలు అందుకోవాలని ఆశించింది.

ఆమెకు గాల్లో తేలినట్టుగా వుంది. తన కృషికి గుర్తింపు, తను పడిన కష్టానికి ప్రతిఫలం లభించిందన్న ఉద్వేగం ఆమెను నిలువనీయటం లేదు.

సాయంత్రం ఐదింటికల్లా ఇంటికి చేరుకుని, భర్త కార్తీక్ కోసం ఎదురుచూస్తూ పనులు మొదలుపెట్టింది. నిజానికి పావని కంటే సీనియర్ టీచర్స్ ఎంతోమంది వున్నారు ఆ స్కూల్లో. వారందరికీ కాకుండా ఆమెకే ఈ అవార్డు ముందుగా రావటానికి కారణం కేవలం ఆమె సిన్సియారిటీ హార్డు వర్కు మాత్రమే కాదు... పావని చేసింది మామూలు బి.యి డి ట్రైనింగే అయినా మిగతా అందరి టీచర్స్ లా కాకుండా, ఆ స్కూల్లో జాయినయ్యే కొంతమంది మెంటల్లీ చాలెంజ్డ్ స్టూడెంట్స్ కి కూడా ఎంతో ఓర్పుగా, శ్రద్ధతో పాఠాలు చెబుతుంది. క్లాసులో వున్న మామూలు పిల్లలతో పాటుగా, మానసిక పరిస్థితి సరిగా లేని పిల్లలకు కూడా చదువు

చెప్పటం తన వృత్తిలో భాగమే అని ఆమె భావిస్తుంది. అందుకే మానసిక వైకల్యం వున్న పిల్లలకు ప్రేమలో దగ్గరకు తీసి, వారి మీద ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో ఆశించిన మార్పు తీసుకువచ్చేందుకు ఎంతో కష్టపడేది.

తన కొలీగ్స్ పావనిని ఎద్దేవా చేసేవారు. "నీకెందుకొచ్చిన తలనొప్పి, వాళ్ళని మార్చినా మార్చకపోయినా నీ శాలరీ నీకు వస్తుంది, ఎందుకు అనవసరం గా టం వేస్ట్ చేస్తావు అని అదేమీ పట్టించుకునేది కాదు పావని. తాను చెప్పే పాఠాలు అందరికీ అర్థం అవ్వాలంటే.... మానసిక ఆరోజ్యం బాగోలేని పిల్లలలో మార్పు రావాలి. అందుకే, ఎవరేమనుకున్నా, శ్రమ ఎక్కువైనా, వారిని లాలించి, ప్రేమించి తన మాట వినేలా చేసుఓవటం లో సఫలీకృతురాలయ్యేది. అదే, ఆమెకు చిన్న వయసులోనే 'బెస్ట్ టీచఋ అవార్డు అందుకునేలా చేసింది.

మేనేజ్మెంట్ వాళ్ళు తనని గుర్తించినందుకు పొంగిపోయింది పావని. అంతేకాదు అందరూ చిన్న చూపు చూసి నవ్వుకునే తమ పిల్లల్ని చేరదీసి, వాళ్ళల్లో నుంచి మార్పు తీసుకువచ్చినందుకు ఆ పిల్లల తల్లితండ్రులు ఇంటికి వచ్చి మరీ పావనికి కృతజ్ఞతలు చెప్పేవారు. అన్నీ గుర్తుచేసుకుంటూ, పనులు ముగించుకుని స్నానం చేసింది. ఎందుకో హాల్లో కూర్చుని షోకేసులో వున్న వరున్ ఫోటో వైపు యధాలాపం గా దృష్టి సారించిన ఆమెకు చిన్నగా కలవరం గా అనిపించింది. వరుణ్ గుర్తురాగానే ఆమెలో 'అంతర్మధనం ' మొదలయ్యింది.నిజం గా తను ఈ అవార్డు అందుకోవడానికి అర్హులేనా? అనిపించింది ఆమెకు. కొన్నాళ్ళ క్రితం జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది పావనికి.

కార్తీక్ కి ఒక్కగానొక్క అన్నయ్య శ్రీకాంత్, అతని భార్య శ్రావణి. వాళ్ళిద్దరికీ కలిగిన సంతానం వరున్. కార్తీక్, పావనిల పెళ్ళినాటికి వాడికి నాలుగేళ్ళు వుంటాయి. ముద్దులు మూటగట్టేలా వుంటాడు. వాడంటే అందరికీ ఎంతో ఇష్టం. తమ పెళ్ళయిన ఈ రెండేళ్ళలో వరున్ బాగా దగ్గరయ్యాడు. వాళ్ళుండేది వేరే ఓర్లోనే అయినా తరచూ అన్నదమ్ముళ్ళిద్దరూ కలుసుకుంటూనే వుంటారు. వరుణ్ కూడా వచ్చిరాని ముద్దు మాటలతో పావనిని పిన్నీ పిన్నీ అని పిలుస్తూ ఆమె వెనకాల తిరుగుతాడు. కార్తీక్, పావని అప్పుడే పిల్లలు వద్దనుకుని ఫ్యామిలీ ప్లానింగ్ చేస్తున్నారు.

ఇంతలో ఉన్నట్టుండీ ఘోరం జరిగిపోయింది. బైక్ మీద వస్తుండగా జరిగిన యాక్సిడెంట్ లో శ్రీకాంత్, శ్రావణి అక్కడికక్కడే మరణించారు. అదృష్టం కొద్దీ అమ్మానాన్నలతో పాటీ వున్న వరున్ మాత్రం ప్రాణాలతో బైటపడ్డాడు. కానీ.... ఏం లాభం, పాపం తలకి తగిలిన తీవ్రమైన దెబ్బ వల్లో, లేక తల్లితండ్రుల మరణం చూసి తట్టుకోలేకపోవటం వలనో, వరుణ్ కి మతిస్థిమితం తప్పింది.

అప్పట్నుంచి పిచ్చివాడయిపోయాడు. తనలో తనే నవ్వుకోవటం, బట్టలు చింపుకోవటం, అందర్నీ కొరకటం .. ఇలా రకరకాలుగా ప్రవర్తిస్తుండడం తో వెంటనే కార్తీక్ ట్రీట్మెంట్ ఇప్పించాడు, వరుణ్ కి....

తల్లితండ్రుల్ని మరిపించేలా మరెవరైనా ఎంతో ఓపిగ్గా ఆ పిల్లవాడ్ని ప్రేమించి లాలిస్తే త్వరలోనే కోలుకుంటాడు అని డాక్టర్సు చెప్పటం తో పావనిని అర్థించాడు కార్తీక్ "ప్లీజ్ పావనీ, మనం వరుణ్ని మన బిడ్డగా పెంచుకుందాం, మనకి పిల్లలు వద్దు" అని

ససేమిరా ఒప్పుకోలేదు పావని. " మతి స్థిమితం లేని పిల్లోడ్ని పూర్తి బాధ్యతగా చూసుకోవడం నా వల్ల కాదు, నాకూ ఒక లైఫ్ వుంది. నాకూ పిల్లలు కావాలి.... నాకేమాత్రం సంబంధం లేదు వరుణ్ విషయం " అని ఖరాకండిగా భర్తతో చెప్పేసింది. చేసేదేమీ లేక వరుణ్ ని వాళ్ళ అమ్మమ్మ వాళ్ళ సమ్రక్షణలో వదిలి వచ్చాడు కార్తీక్. అప్పట్నుంచి ముభావంగానే వుంటున్నాడు పావనితో. అది గమనించినా, తర్వాత, ఆయనే మళ్ళీ మామూలుగా మారుతారులే అని సరిపెట్టుకుంది పావని. కానీ, ఈ రోజు తనకి అవార్డు ఇవ్వబోతున్నారని తెల్సి ఆనందించినా మనసులో మాత్రం చాలా గిల్టీగా వుంది పావనికి.

చాలాసేపు ఆలోచించిన మీదట ఒక స్థిర నిర్ణయానికి వచ్చింది పావని. తను స్కూల్లో అవార్డు అందుకోవాలంటే వరుణ్ కి తల్లిగా మారాలని దృఢం గా అనుకుంది. తన వృత్తి లో ఎంత అంకిత భావం గా పనిచేసి మంచి టీచరు అనిపించికుందో, అలాగే నిజ జీవితం లో కూడా బాధ్యత సక్రమం గా నిర్వర్తించి, భర్తకు అనుకూలవతి అయిన భార్య గా కూడా తన స్థానం పదిలపరుచుకోవడం ఉత్తమమని పావని భావించింది. అంతేకాదు, పల్లెటూరులో తమకు దూరం గా వుంటున్న అత్తగార్ని, మామగార్ని కూడా ఇక్కడికే తీసుకువచ్చి వారి సహకారం తో, తమ ప్రేమతో వరుణ్ ని మామూలుగా చేయాలనీ, ఆ తర్వాతే తను పిల్లల్ని కనాలా? వద్దా అని విషయం లో భర్త తో సంప్రదించి ఒక నిర్ణయానికి రావాలని అనుకున్నాక ఆమె మనసెం తో తేలికైనట్టు ఫీల్ అయ్యింది.

ఆలస్యంగా ఇంటికి వచ్చాడి కార్తీక్, మౌనం గా స్నానం ముగించి, టీవీ ముందు కూర్చున్న భర్త దగ్గరకు వచ్చి తనకు వచ్చిన అవార్డు గురించి చెప్పింది పావని.

"కంగ్రాట్స్" అని పొడిగా అన్నాడు కార్తీక్. భర్త మనసులో బాధ ఆమెకు తెలుసు. తను తీసుకున్న నిర్ణయం గురించి చెప్పింది పావని. ఆనందం తో పావనిని గిరగిరా తిప్పేసి ఆమెను ముద్దులతో ముంచెత్తాడు కార్తీక్. వరుణ్ చాలా మొండిగా ప్రవర్తిస్తున్నాడు అని ఇంతక్రితమే ఫోన్ చేశారు వరుణ్ అమ్మమ్మ, తాతయ్య.

పెద్దవాళ్ళయిపోయిన వాళ్ళకు వరుణ్ సమస్యలా మారాడు. ఎలా? అని ఆలోచిస్తూ బయటే తిరుగుతూ ఆలస్యం గా ఇంటికి చేరుకున్న అతడికి పావని చెప్పిన మాట శుభపరిణామం లా తోచింది. అనుకున్నట్టుగానే వరుణ్ ని ఇంటికి తీసుకువచ్చి కన్నతల్లిలా ఆదరించింది. ఓర్పుతో ప్రేమతో అతడి లోని మనోవేదనని దూరం చేసింది. కేవలం రెండు సంవత్సరాల్లోనే పూర్తి ఆరోజ్యవంతుడైనాడు వరుణ్. ఆ తరువాత సంవత్సరం తిరిగే సరికల్లా ముద్దులొలికే ఆడపిల్లకి జన్మనిచ్చింది పావని.

మనకు ఒక బాబు, ఒక పాప... చాలు అని తృప్తిగా చెప్పింది భర్తతో, పాప పుట్టగానే ఇక పిల్లలు వద్దనుకుని ఆపరేషన్ కూడా చేయించేసుకుంది. తను చేస్తున్న వృత్తిలో అంకిత భావం తో పనిచేసి 'మంచి టీచరు" గా అవార్డు అందుకోవటమే కాకుండా, కుటుంబం లో కూడా తన ధర్మం సక్రమం గా నిర్వర్తించి మంచి కోడలిగా, అనుకూలవతి అయిన అర్ధాంగిగా, ఆదర్శ తల్లిలా, మిగతా కుటుంబ సభ్యులందరి మన్ననలను అందుకుంది పావని. అదే ఆమెకు నిజమైన "అవార్డు"




చిన్నప్పట్నించి నా స్థూలకాయం మీద నేను యుద్ధం ప్రకటిస్తూనే వున్నా..అలాగే ఓడిపోతూనే వున్నా. ఆ విషయంలో గజనీమహమ్మదే నయం. అసలు చిన్నప్పట్నించి నేను లావే! పిల్లాడిగా వున్నప్పుడు బొద్దుగా వుంటే అందమే కాని పెద్ద స్కూల్లో చేరాక..నన్నందరూ లావుగా వున్నానని వెక్కిరిస్తూ వుండేవారు. అప్పుడు నాలో నేను ఉడుక్కుని లావు మీద యుద్ధం ప్రకటించేవాణ్ణి. ఓ పదిరోజులపాటు విపరీతమైన వాకింగ్ చేసేవాణ్ణి. తర్వాత కాళ్ళ నొప్పులు బద్ధకంతో మానేసేవాణ్ణి.

అలా అలా లావు మీద యుద్ధం ప్రకటిస్తూ..ఓడిపోతూ..చదువు పూర్తి చేసుకుని ఉద్యోగస్తుడినయ్యాను. నా లావు పెళ్ళి సంబంధాల విషయంలో కూడా అడ్డొచ్చింది. కట్నాలు కానుకలూ, జాతకాల తర్వాత ముఖ్యంగా చూసేది ఈడూ జోడు. బక్కగా వున్న అమ్మాయి నా పక్కన పిలగా వుండేది. లావుగా వున్న అమ్మాయి హిడింబిలా భయానకంగా వుండేది. సరే ఎలాగో ఓ మోస్తరు పిల్లతో పెళ్ళయింది.లావు తగ్గి స్లిమ్ గా వుండాలని ఎవరికి మాత్రం వుండదు..కానీ ఎలా?

***

ఒకరోజు నాక్కాస్త కళ్ళు తిరిగాయి. డాక్టర్ కి చూపించుకున్నాను. "మీకు చాలా హై బిపి వుందండీ! మీరు లావు తగ్గాలి లేకపోతే కిడ్నీ ఫెయిల్యూర్కానీ, హార్ట్ ఎట్టాక్ కానీ, బ్రెయిన్ హేమరేజ్ కానీ, పెరాల్సిస్ స్ట్రోక్లాంటివేవైనా రావచ్చు."అని డాక్టర్ కృష్ణుడిలా మెడికోపదేశం చేశాడు.

దాంతో నా గుండె జారిపోయింది. మళ్ళీ లావు మీద యుద్ధం ప్రకటించాను. ఇంటికొచ్చి నా శ్రీమతితో "చూడు..వాణీ! నేను హఠాత్తుగా లావు తగ్గకపోతే నీ మంగళసూత్రానికి హాని జరిగి నీకు నా ఇన్సురెన్స్ వచ్చేస్తుంది. అంచేత మాంగళ్యం కాపాడుకోవాలంటే ఇంట్లో నూనె వినియోగం, ఉప్పుకారాలు తగ్గించు..లేదంటే వచ్చే ఇన్సురెన్స్ డబ్బు బ్యాంకులో వేసుకుని పొదుపుగా కాలం గడపండి"అన్నాను.

"ఆపండి..మీ అమంగళపు మాటలు..మీరు కల్పవృక్షం లాంటివాళ్ళు. ఎవరన్నా కల్పవృక్షం కుప్పకూలిపోవాలని చూస్తారా? ఎప్పటికైనా ఇన్సురెన్స్ నాకు రావలసిందే కదా..అప్పటిదాకా ఎదురుచూస్తా..అంతేకాని మిమ్మల్ని పైలోకానికి ఇంత తొందరగా చేరనివ్వను"అంది పదానికి పదానికీ మధ్య చాలా గ్యాపిస్తూ ముఖకవళికలు మారుస్తూ..టీ వి సీరియల్ లోని పాత్రలా..

ఆరోజు నుంచి నాకు మాత్రం నేచర్ క్యూర్ హాస్పిటల్ లోని ఫుడ్..పిల్లలకీ తనకీ మాత్రం ఆవకాయ, మాగాయ, నూనెలో తేరట్లాడే వడియాలు, వేపుళ్ళూ..రుచికరమైన వంటకాలు. నాకు ఆ గడ్డి తినాలంటే బాధగానే వుంది..కానీ ఏం చేస్తాం? ‘నేను త్వరలోనే స్లిమ్ అవడం ఖాయం..నా పర్సనాలిటీతో అందమైన అమ్మాయిలకి లైనేస్తే అప్పుడు తెలుస్తుంది దానికి’ కసిగా మనసులో అనుకున్నాను(ఎందుకో?).విధి ఎలాంటిదంటే..సరిగ్గా అప్పుడే..పెళ్ళిళ్ళు శుభకార్యాలకి చాలా ఆహ్వానాలందుకున్నాం. ఆ కార్యక్రమాలకి వెళ్ళినప్పుడు ముఖ్యంగా ఆకర్షించేవి ఆహారపదార్థాలే..ముక్కుపుటాలదరగొట్టే ఘుమఘుమలే! నిజానికి ‘పేరు దేవుడిది..నైవేద్యం మనకి’ లాగా..శుభకార్యాలకి వెళ్లేది కమ్మటి పదార్థాలు తినడానికే కదా! నన్ను నేను వాటిదగ్గరకి వెళ్ళకుండా కట్టేసుకోవడానికి..నాలికని మడతేసుకుని నోటిలో మూసెయ్యడానికి మహా కష్టపడాల్సొచ్చింది. పైగా "ఏమిటండీ..మీరేం తినట్లేదు" అని ఎవరన్నా అంటే "మా ఆయన స్ట్రిక్ట్ డైటింగ్ లో వున్నాడు. టెంప్ట్ చేయకండి.. అయినా ఆయన అవడనుకోండి..ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే అంతే ఆయన!" అని పదిమందిలో కితాబిచ్చేది మా ఆవిడ. అలా ఇన్ స్ట్రక్షన్

ఇచ్చింది నేనే, కాకపోతే..మనసులో ఏమిటో తెలియని బాధ సుళ్ళు తిరిగేది. అందరూ సుఖ పడుతుంటే నేనొక్కడినే వెలివేయబడినట్టు అనిపించేది.

ఒక పెళ్ళిలో..అక్కడి పదార్థాలు నా కట్లు తెంపేశాయి. గట్టుదాటిన వరదలా..పొలంగట్టు దాటిన దున్నలా పదార్థాల మీద పడిపోయాను. వీటినా? ఇన్నాళ్ళూ వదిలి..ఋషిపుంగవుడిలా ఆకులూ అలములూ తింటూ తిరిగింది?..కాకిలా కలకాలం బ్రతికేకన్నా..హంసలా కొద్దికాలం బ్రతికినా చాలు (ఈ సామెత ఇక్కడ వర్తిస్తుందో లేదో అప్రస్తుతం) అనుకుని నన్ను నేను సమాధానపరచుకున్నాను. మా ఆవిడా పిల్లలు వింతగా..విడ్డూరంగా చూస్తున్నారు. "ఏంట్రా అలా చూస్తున్నారు?"కోపంగా ప్రశ్నించాను.

"డాడీ..నువ్వు ఇన్నాళ్ళూ మానేసినదంతా ఇవాళే తినేశావు"అన్నాడు మా రెండోవాడు.

నిజమే..ఇన్నాళ్ళ డైటింగ్ తో..కొద్దిగా లోపలికి వెళ్ళిన పొట్ట..ఇప్పుడు పెద్ద బెలూన్లా ఉబ్బింది.

"సర్లే..సర్లే"అని ఇంటికి బయల్దేరాను. ఆరోజుతో డైటింగ్ సరి.

ఆతర్వాత పక్కవాటాలోకి పరమేశం ఫ్యామిలీ దిగింది.

అందులో కొట్టొచ్చినట్టు కనబడింది పరమేశం. నా బరువు మహా అయితే ఓ వంద కే జీలుంటుంది..కానీ పరమేశం నూటేభైకి తక్కువుండడు.నేనతనితో పరిచయం పెంచుకుని "ఏవండీ..మన లావు చూశారుగా! అందరూ దిష్టి కొట్టడానికి తప్ప దీనితో ఏముపయోగం? పైగా మనమీద పగబట్టినట్టు రోగాలు అదనుకోసం ఎదురుచూస్తుంటాయి. డాక్టర్లకయితే పండగే..అంచేత మనం ఎర్లీ మార్నింగ్ వాకింగ్ చేద్దాం. ఒకరికొకరం అయితే టైం టేబుల్ తప్పం."అన్నాను.

"నేనూ కంపెనీకోసమే చూస్తున్నానండీ..తప్పకుండా చేద్దాం" అన్నాడు. నిజానికి నాకు కుక్కలంటే భయం. అందుకనే ఇన్నాళ్ళూ తోడు కోసం చూశాను. లక్కీగా దొరికాడీయన.

మరుసటిరోజు మూడు గంటలకి లేచి ట్రాక్ సూట్ లో సిద్ధంగా వున్నాను. నాలుగింటికి ఆయన తలుపు తట్టాడు.

"నేను మూడు గంటలకే లేచి ప్రిపేరయి ఉన్నానండీ" నేనెంత డిటర్మినెంటో తెలియజేసాను.

ఇద్దరం వారం పాటూ క్రమం తప్పకుండా చేశాం. ఎనిమిదో రోజు ఆయన వచ్చి మా తలుపు తట్టలేదు. నేనే పదినిముషాలు చూసి వాళ్ళ తలుపు తట్టాను. ఆయన విసుగ్గా బయటకొచ్చి"నేను రాత్రి ఆఫీసునుండి బాగా ఆలస్యంగా వచ్చాను. నిద్ర సరిపోలేదు అంచేత మీరెళ్ళొచ్చేయండి"అని ముఖంమీదే తలుపేసేసాడు.

'పోన్లే..ఒక్క రోజు వెళ్ళకపోతే ఏమవుతుంది' అనుకుని లోపలికొచ్చి మంచంమీద వాలిపోయాను. మా ఆవిడెందుకో నిద్రలో నవ్వినట్టనిపించింది.

అలా ఆ వాకింగ్ కాశీకెళ్ళిపోయింది.

ఆ తర్వాత జిమ్..వెయిట్ రిడక్షన్ ట్రీట్మెంట్..స్లిమ్ క్యాప్సూల్స్..సైక్లింగ్..వాట్ నాట్ ఎన్ని ప్రయోగాలు చేసినా ఇంచ్ కూడా తగ్గలేదు. వెయిట్ లో ఒక్క గ్రామ్ తేడాలేదు.

'ఓడిపోయాను..లావుతో చేసిన యుద్ధంలో ఓడిపోయాను. సైంటిస్ట్ లు ఇన్నన్ని కనుక్కుంటుంటారు..ఎయిడ్స్ ..క్యాన్సర్ మహమ్మారుల్ని రూపుమాపడానికి కంకణం కట్టుకుంటారు కాని..అమాంతం లావుని తగ్గించే ఒక చిన్న ట్యాబ్లెట్ కనుక్కోలేకపోతున్నారు! అసలు అలాంటి రోజొకటి వస్తుందా?' మా ఆవిడందించిన చిక్కటి కాఫీ తాగుతూ...పొట్టనిమురుకుంటూ బాధగా అనుకున్నాను.